



విజయపురలో ముస్తాబైన శ్రీవారు

నేడు ముక్కోటి ఏకాదశి

● వైకుంఠ ద్వార ప్రవేశానికి సర్వం సిద్ధం


● సర్వాంగ సుందరంగా ముస్తాబైన శ్రీవారి ఆలయాలు

- 5లో

టన్నెల్‌తో ట్రాఫిక్ కష్టాలకు... చెక్..!



నగరంలో ట్రాఫిక్ కష్టాలు (ఫైల్)



సొరంగ మార్గ నమూనా

● నగరంలో సొరంగ మార్గం నిర్మాణానికి బీబీఎంపీ నిర్ణయం ● రూ.14వేల కోట్లతో డీపీఆర్ సిద్ధం ● భూ సేకరణకు రూ.800కోట్లు ● కిలోమీటరుకు రూ.898 కోట్ల ఖర్చు అంచనా ● 60/40 నిష్పత్తిన పీపీపీ పద్ధతిలో నిర్మాణం

బెంగళూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): నగరంలో కొనసాగుతున్న ట్రాఫిక్ సమస్య అంతర్జాతీయస్థాయిలో చర్చకు కారణమవుతోంది. ఇటీవల ప్రపంచవ్యాప్తంగా పలు ప్రధాన నగరాల్లో జరిపిన సర్వేలో బెంగళూరులో ప్రయాణానికి సమయం నిర్ధారించడమే కష్టమని పలువురు అభిప్రాయపడ్డారు. నగర విస్తీర్ణం పెరగడమే కాకుండా వలసలు వచ్చే వారిసంఖ్య ప్రతినెలా అధికమవుతుండడంతో శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వం యోచిస్తోంది. మెట్రో ప్రాజెక్టులు వేగవంతంగా నిర్మాణాలు చేపట్టడం, రింగ్‌రోడ్ల ఏర్పాటే కాకుండా నగరంలో సొరంగమార్గం ఏర్పాటు చేయాలని తీర్మానించారు. ఇలా ప్రాజెక్టు సమగ్ర నివేదిక (డీపీఆర్) సిద్ధం చేశారు.

సిల్క్‌బోర్డు జంక్షన్ వరకు...

ఉత్తర-దక్షిణ కారిడార్‌ల మీదుగా హెబ్బాళలోని ఎస్టీమ్‌మాల్ నుంచి సిల్క్‌బోర్డు జంక్షన్ వరకు సొరంగ మార్గం నిర్మాణానికి జనవరి నెలాఖరులోనే అంతర్జాతీయస్థాయిలో టెండర్లను ఆహ్వానించాలని నిర్ణయించారు. నమ్మ మెట్రో తరహాలోనే సొరంగ మార్గాన్ని ఏర్పాటు చేయనున్నారు. 120 అడుగుల లోపు సొరంగ మార్గం నిర్మాణానికి నిధులకోసం బృహత్ బెంగళూరు మహానగర పాలికె (బీబీఎంపీ) రుణం తీసుకోవాలని నిర్ణయించింది. తొలి విడతలో హెబ్బాళలోని ఎస్టీమ్ మాల్ జంక్షన్ నుంచి సిల్క్‌బోర్డు కేఎస్ఆర్‌పీ జంక్షన్ వరకు నిర్మాణం చేపట్టదలిచారు. పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) ద్వారా నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించారు. ప్రైవేట్ కంపెనీ, బీబీఎంపీ 60/40 నిష్పత్తిన ఖర్చు చేయాలని నిర్ణయించారు.

రూ.14,900 కోట్ల ఖర్చు

సొరంగనిర్మాణానికి రూ.14,981 కోట్లు ఖర్చు కానుందని అంచనా వేశారు. ఇందులో భూస్వాధీనానికి 800కోట్లు అవసరం కానుందని డీపీఆర్‌లో నిర్ధారించారు. ప్రతి కిలోమీటరుకు రూ.898 కోట్లు ఖర్చు చేయనున్నారు. భారీ పెట్టుబడి కావడంతో కనీసం 8వేల కోట్ల రూపాయలు రుణం తీసుకునేందుకు బీబీఎంపీ కసరత్తు ప్రారంభిస్తోంది. తక్కువధరతో వడ్డీకి ఇచ్చే సంస్థలకోసం టెండర్లను ఆహ్వానిస్తోంది. ఇప్పటికే పలు జాతీయబ్యాంకులు, హడ్కో, పీఎఫ్‌టీ, ఆర్ఈసీతోపాటు పలు ఫైనాన్స్ సంస్థలు రుణం మంజూరు చేసేందుకు సొరంగమార్గం ప్రాజెక్టు నివేదికను పొందారు. ఏ సంస్థ ఎంతమేర వడ్డీ నిర్ణయిస్తుందో వాటికి అనుగుణంగా తీసుకునేందుకు బీబీఎంపీ ప్రయత్నిస్తోంది. సొరంగమార్గ నిర్మాణానికి రూ.14వేలకోట్ల ఖర్చు అవుతుండడంతో 60శాతం నిష్పత్తిప్రకారం కనీసం 8వేలకోట్ల రూపాయలు బీబీఎంపీ సమకూర్చాల్సి ఉంటుంది. మిగిలిన మొత్తం కాంట్రాక్టు పొందే సంస్థ భరించాల్సి ఉంటుంది.

ఐదుచోట్ల ప్రవేశద్వారాలు

హెబ్బాళ జంక్షన్‌లో సొరంగ మార్గంలో ప్రవేశిస్తే సిల్క్‌బోర్డు చేరేసరికి మధ్యలో మూడుచోట్ల ప్రవేశద్వారాలు ఉంటాయి. ఇలా మొత్తం 5చోట్ల ప్రవేశమార్గాలు ఏర్పాటు చేసినట్లు అవుతుంది. ప్యాలెస్‌గ్రౌండ్స్ లేదా మేఖ్రి సర్కిల్, రేస్‌కోర్సురోడ్డు లేదా విధానసౌధ, లాల్‌బాగ్ వెనుకభాగాన ఉండే అశోకపిల్లర్, సిల్క్‌బోర్డు వద్ద ఎంట్రీలు కల్పించనున్నారు. ఈ ఐదు చోట్ల ప్రవేశ, నిర్గమన ర్యాంప్‌లు ఉంటాయి.

70 నిమిషాలు ఆదా..

సిల్క్‌బోర్డు నుంచి హెబ్బాళ ఎస్టీమ్‌మాల్ వరకు నిత్యం రద్దీగా ఉంటుంది. ఈ ప్రాంతంలోనే వాహనాల సంచారం అధికంగా ఉంటుంది. హైదరాబాద్ జాతీయ రహదారితోపాటు అంతర్జాతీయ విమానాశ్రయం ఉండడంతో నగరంలోని అన్ని ప్రాంతాల వాసులకు ఈ రోడ్డు కీలకంగా ఉంది. ఈ మార్గంలో గంటకు 10-15 కిలోమీటర్లు మాత్రమే ప్రయాణించేందుకు వీలుంది. సొరంగ మార్గం నిర్మిస్తే 16 కిలోమీటర్ల దూరాన్ని కేవలం 20నిమిషాల్లో చేరుకునేందుకు వీలుంటుంది. తద్వారా 70 నిమిషాలు ఆదా కానుంది.

కిలోమీటరుకు రూ.898 కోట్లు

ఎస్టీమ్‌మాల్ జంక్షన్‌నుంచి కేఎస్ఆర్‌పీ జంక్షన్ వరకు 16.67 కిలోమీటర్లు పొడవుంది. ప్రతి టన్నెల్‌లోనూ మూడులేన్‌ల రహదారి నిర్మిస్తారు. తద్వారా 10,500మీటర్ల వెడల్పు కానుంది. ట్విన్‌క్యూబ్ సొరంగమార్గంలో 6లేన్‌ల రోడ్డు రెండువైపులా ఉంటాయి. అంబులెన్స్, బీఎంటీసీ, పోలీసు వాహనాల సంచారానికి ప్రత్యేక మార్గం కేటాయించదలిచారు. గతంలో ఒక కిలోమీటరు నిర్మాణానికి రూ.500కోట్లు అంచనా వేశారు. ఇటీవల రూపొందించిన డీపీఆర్‌లో ప్రతి కిలోమీటరుకు 898 కోట్ల రూపాయలు అవసరమని నిర్ధారించారు.

20 ఏళ్ల కాంట్రాక్టు కేటాయింపు

సొరంగమార్గ నిర్మాణం, పర్యవేక్షణ, అప్పగించే ప్రక్రియ (బీఓటీ) పద్ధతిన టన్నెల్ నిర్మాణం చేపట్టనున్నారు.. అంతర్జాతీయస్థాయిలో టెండర్లకు అర్హత కల్గిన కంపెనీలకు కేటాయించాలని నిర్ణయించారు. కనీసం 20ఏళ్లపాటు కాంట్రాక్టు కేటాయించాలని నిర్ధారించారు. 20ఏళ్ల వ్యవధికి టోల్ వసూలు చేసుకునే వెసలుబాటు ఆయా కంపెనీలకు కల్పించనున్నారు. ఆ తర్వాత మహానగర పాలికెకు అప్పగించాల్సి ఉంటుంది. ప్రాజెక్టు అంచనా ప్రకారం రూ.18-24 టోల్ నిర్ణయించే అవకాశం ఉంది. ప్రవేశం, ఎగ్జిట్ ప్రాంతాల్లో అవసరమైన భూస్వాధీన ప్రక్రియకు రూ.800కోట్లు అవసరమని అంచనా వేశారు. అండర్ గ్రౌండ్ మార్గంతో ట్రాఫిక్ కష్టాలు తీరనున్నాయని నగరవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.





ఎద్దులు, ఆవులకు దుప్పట్లు కప్పిన రైతు

చలించాడు..!

● చలి నుంచి కాపాడేందుకు పశువులకు దుప్పట్లు కప్పిన రైతు

బళ్లారి గాంధీనగర్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): పశువులంటే అందరికి లోకువ.. గాలి, వాన, చలి ఉన్నా పట్టించుకోం... మనం మాత్రం గొడుగులు, స్వెటర్లతో కాపాడుకుంటాం. .అయితే పశువుల కష్టాల పైనా చలించి ఓ రైతు మానవత్వం చాటుకున్నాడు. నెల రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా చలి పెరిగిన సంగతి తెలిసిందే. మంచు కారణంగా రహదారులు సైతం మూసుకుపోతున్న సంగతి తెలిసిందే. గదగ్ జిల్లా పరిధిలోని ఓ రైతు తన జీవనానికి తోడుగా నిలిచిన పశువులను తన కుటుంబ సభ్యులతో సమానంగా చూసుకుంటున్నాడు. లక్ష్మేశ్వర గ్రామానికి చెందిన రైతు హనుమన్న వారం రోజులుగా ఎముకలు కొరికే చలికారణంగా వసారాలోని ఎద్దులు, ఆవులు వణికిపోవడం చూశాడు. పరిస్థితిని గమనించి చలిబారినుండి రక్షించడానికి వాటిపై బెడ్‌షీట్లు ఆదర్శంగా నిలిచాడు. తనకు అన్నం పెట్టే పశువులపై ప్రేమను చాటుకుని ఔరా..అనిపించుకున్నాడు.



సీఎంతో సెల్ఫీ తీసుకుంటున్న కొడవ మహిళా బృందం

కొడవ కుటుంబ హాకీకి గిన్నిస్ రికార్డు

● అభినందించిన సీఎం -5లో..

విందుపై గోల..

ఎందుకో..?

● రాజకీయాల్లో ఒడిదుడుకులు సహజం ● ఆందోళన పడితే ఎలా..?: మంత్రి సతీశ్ జార్కిహొళి



బెంగళూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): రాజకీయాల్లో ఒడిదుడుకులు సహజమని, వాటిని ఎవరైనా ఎదుర్కోనక తప్పదని విందు నిర్వహిస్తే ఆందోళన చెందాల్సిన అవసరం ఏముందని ప్రజాపనులశాఖ మంత్రి సతీశ్ జార్కిహొళి ప్రశ్నించారు. గురువారం బెళగావిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎస్సీ ఎస్టీ సామాజికవర్గానికి చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులు విందు ఏర్పాటు చేసుకుంటే ఆందోళన ఎందుకన్నారు. మేం సమన్వయంగా కలసి భోజనం చేయదలిచామని, మా అజెండా ప్రకారం చర్చలు జరుపుకొంటామన్నారు. ఇతరులకు భయమెందుకన్నారు. సభ ఏ ఉద్దేశంతో ఆహ్వానిస్తున్నారో తనకు తెలియదని, తనను పిలిచారన్నారు. వారు ఏ అంశాలపై చర్చించేది ముందుగా తెలపలేదన్నారు. విందులో పాల్గొన్నంత మాత్రాన ఏదో జరిగిపోతుందనే ఆందోళన సరికాదన్నారు. డీసీఎం డీకే శివకుమార్ అయినా, ఇతరులైనా ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. భవిష్యత్తులో ఇటువంటి భేటీలకు అధిష్ఠానంతో చర్చించి అమలు చేస్తామన్నారు. రాజకీయాల్లో ఉన్నవారికి వెనుక ముందు, గెలుపోటములు పరిగణించాల్సిన అవసరం లేదన్నారు. కానీ ప్రజాసమస్యలపై నిరంతరంగా ఆలోచించక తప్పదన్నారు. ఒక్కసారి మేం ఓడిపోయామని అంతమాత్రాన కుంగిపోతామా అన్నారు. కేపీసీసీ అధ్యక్షుడికి సంబంధించి అధిష్ఠానం నిర్ణయిస్తుందన్నారు. సభ జరిపి తీర్మానిస్తుందన్నారు. తాను రాజకీయాల్లో కేంద్రబిందువు కాదన్నారు. తన పనులు తాను చేసుకుంటూ పోతానన్నారు. అయితే కేంద్రబిందువుగా మారితే తానేం చేయలేనన్నారు. ఎప్పుడు ఎలా ఉండాలో అందుకు తగ్గట్టుగా వ్యవహరిస్తానన్నారు.

జ్యుడీషియల్ కస్టడీకి ఆరుగురు మావోలు..

● పరప్పన జైలుకు తరలింపు

బెంగళూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): లొంగిపోయిన ఆరుగురు మావోయిస్టులకు జ్యుడీషియల్ కస్టడీ విధిస్తూ ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు ఆదేశించింది. బుధవారం సీఎం సమక్షంలో ఆరుగురు మావోలు లొంగిపోయిన సంగతి తెలిసిందే వారిని చిక్కమగళూరు డీఎస్పీ బాలాజీసింగ్ అదుపులోకి తీసుకున్నారు. గురువారం ఉదయం వారందరికీ విక్టోరియా ఆసుపత్రిలో వైద్య పరీక్షలు జరిపించారు. అనంతరం ఎన్ఐఏ కోర్టు న్యాయమూర్తి గంగాధర్ ఎదుట హాజరు పరిచారు. లొంగిపోయిన నక్సల్స్ ముండగారు లత, సుందరి కొత్తూరు, వనజాక్షి బాళహొళె, జిశా, వసంత్, మారప్ప ఆరోళిలకు న్యాయమూర్తి ఈనెల 30వరకు జ్యుడీషియల్ కస్టడీ విధించారు. దీంతో వారందరినీ పరప్పన అగ్రహారజైలుకు తరలించారు. కాగా లొంగిపోయినవారిలో ముండగారు లతపై 59 కేసులు, సుందరిపై ఉడుపి, దక్షిణకన్నడ జిల్లాల్లో 3కేసులు, వనజాక్షిపై 15కేసులు ఉండగా వసంత్, టిఎన్ జిశాలపై నమోదైన కేసుల వివరాలను ఆరా తీస్తున్నారు. ముండగారు లత శృంగేరిలో పీయూలోనే చదువు ఆపేసి కుదురేముఖ్ విమోచనా పోరాటంలో క్రియాశీలకంగా వ్యవహరించి నక్సల్స్ గ్రూప్‌లో చేరారు. సుదీర్ఘకాలంపాటు కుదురేముఖ్ ఉద్యానవనాన్ని రక్షించాలని ఆమె సారథ్యంలో పోరాటాలు సాగాయి. దక్షిణకన్నడ జిల్లా బెళ్తంగడి కొత్తూరుకు చెందిన సుందరి సోదరుడు వసంత్ అలియాస్ ఆనంద్ కూడా నక్సల్‌గా కొనసాగాడు. అతను 2010లో ఎన్‌కౌంటర్‌లో హతమయ్యాడు. కాగా లొంగిపోయిన నక్సల్స్‌లో ముండగారు లత బృందం ఉన్న రవీంద్ర ఆచూకీలేకుండా పోయాడు. శృంగేరి తాలూకా రవీంద్ర, జయణ్ణలు లత టీమ్‌లో ఉన్నవారే. విక్రమ్‌గౌడ ఎన్‌కౌంటర్ తర్వాత వీరిద్దరూ లత నుంచి దూరమయ్యారు. జయణ్ణ అలియాస్ మారప్ప ఆరోళి పోలీసుల ముందు లొంగిపోయాడు. రవీంద్ర ఆచూకీలేకపోవడం గమనార్హం. దీంతో రాష్ట్రంలో మావోయిస్టులు పూర్తిగా తుడిచిపెట్టుకుపోయారని చెప్పలేమనిపిస్తోంది.

ఇన్‌స్పైర్ విజేత నర్మదావ్యాలీ

● రన్నరప్‌గా బెంగళూరు, తృతీయ స్థానంలో అనంత



రన్నరప్‌గా నిలిచిన బెంగళూరు జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఇన్‌స్పైర్ బాలికల ఫుట్‌బాల్ పోటీల విజేతగా నర్మదావ్యాలీ మధ్యప్రదేశ్ జట్టు నిలవగా, రన్నర్‌గా బెంగళూరు, తృతీయ స్థానం లో అనంతపురం జట్టు నిలిచాయి. ఆర్డీటీ స్టేడియంలో ఆర్డీటీ, లాలిగా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నాలుగో ఇన్‌స్పైర్ అండర్-17 జాతీయ స్థాయి బాలికల ఫుట్‌బాల్ పోటీలు గురువారం ముగిశాయి. ఫైనల్ పోరులో నర్మదావ్యాలీ మధ్యప్రదేశ్, బెంగళూరు జట్లు తలపడగా, అత్యుత్తమ ప్రదర్శనతో నర్మద్యావ్యాలీ జట్టు బెంగళూరు జట్టుపై మూడు గోల్స్ తేడాతో విజయం సాధించింది. విజేతగా నర్మదావ్యాలీ, ద్వితీయ స్థానంలో బెంగళూరు జట్లు నిలిచాయి. తృతీయ స్థానం కోసం జరిగిన అనంతపూర్ స్పోర్ట్స్ అకాడమీ, స్పోర్ట్స్ ప్లస్ అకాడమీ చెన్నై మధ్య పోరులో నాలుగు గోల్స్ తేడాతో అనంతపురం జట్టు గెలిచింది. విజేతలకు ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్, ఇండియా ఫుట్‌బాల్ మహిళా జట్టు మాజీ క్రీడాకారిణి అమూల్య కమల్, యూనియన్ బ్యాంకు రీజనల్ మేనేజర్ జితేంద్రకుమార్ మిశ్రా బహుమతులు ప్రదానం చేశారు. ఇన్‌స్పైర్ కప్‌తో గ్రాస్‌రూట్ లెవెల్‌లో 2700మంది క్రీడాకారులు ఫుట్‌బాల్ పోటీలకు ప్రాతినిధ్యం వహించారని, ఇదొక గొప్ప అవకాశమని మాంఛో ఫెర్రర్ పేర్కొన్నారు. మొదటి పోటీల్లో ఐదు జట్లు, రెండో దశలో ఏడు, మూడో దశలో ఎనిమిది, నాలుగోదశలో 12జట్లు పాల్గొనడం బాలికలకు ఫుట్‌బాల్ క్రీడ పట్ల పెరుగుతున్న ఆదరణకు నిదర్శనమని తెలిపారు. ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేణుగోపాల్, ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ, ఫుట్‌బాల్ అకాడమీ కోఆర్డినేటర్ దాదాఖలందర్, యనియన్ బ్యాంకు సీనియర్ అధికారులు యదుభూషణ్ రెడ్డి, రాజేష్, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శ్యామ్ భట్

మానవ హక్కులను కాపాడాలి

● అధికారులకు కమిషన్ చైర్మన్ శ్యామ్ భట్ సూచన

బళ్లారి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మానవ హక్కుల ఉల్లంఘన కాకుండా కాపాడాల్సిన నైతిక బాధ్యత అధికారుల పై ఉందని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ టి. శ్యామ్ భట్ అన్నారు. మానవ హక్కుల కాపాడేందుకు ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ టి.శ్యామ్ భట్, న్యాయవ్యవస్థ సభ్యుడు ఎస్.కే వంటిగోడి, చైర్మన్ వ్యక్తిగత కార్యదర్శి అరుణ్ పూజారా, ఇతర సభ్యులతో కలిసి గురువారం బళ్లారి నగరంలో పర్యటించారు. ముందుగా బళ్లారిలో ప్రభుత్వ ఆసుపత్రి, జిల్లా జైలు, అనాథాశ్రమం, బీఐఎంఎస్ ఆసుపత్రి, హాస్టళ్లల్లో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం డీ.సీ భవనంలో మాట్లాడుతూ అధికారులు మానవ హక్కుల రక్షణకు పనిచేయాలన్నారు. అధికారులు మానవ హక్కుల రక్షణను ప్రథమ కర్తవ్యంగా భావించాలని సూచించారు. వివిధ పనుల పై వచ్చే ప్రజలకు సరైన సమయంలో వారి పనులు చేయకుండా ఆలస్యం చేస్తూ మనవ హక్కుల ఉల్లంఘన చేయడం తగదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటి వరకూ మానవహక్కులు ఉల్లంఘన జరుగుతుందన్నారు. మానవ హక్కుల ఉల్లంఘనకు సంబంధించి కొన్ని కేసులు పరిష్కారం అయ్యాయని మరి కొన్ని కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. హక్కుల కాపాడుకుందుకు, ప్రజలకు అన్యాయం జరిగితే వారికి అండగా నిలిచేందుకు ప్రతి పౌరుడు తన వంతు సహాయం చేస్తూ మానవ హక్కులను కాపాడాలని కోరారు.

లొంగిపోయిన మావోలను

సమగ్రంగా విచారించాలి

● ఏళ్లుగా చట్ట వ్యతిరేక పనులకు పాల్పడ్డారు

● పాకిస్తాన్, ఐఎస్ఐ సాయం పొందారు

: బీజేపీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ సీటీ రవి



బెంగళూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): లొంగిపోయిన మావోయిస్టులను సమగ్రంగా విచారించాలని బీజేపీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ సీటీ రవి డిమాండ్ చేశారు. బెంగళూరులో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మావోయిస్టులు ఆయుధాలను వీడి జనజీవనస్రవంతిలోకి వచ్చారని చెబుతున్నారన్నారు. కానీ ఎన్నో ఏళ్లుగా వారు చట్టవ్యతిరేక కార్యకాపాలలో భాగస్వామ్యులయ్యారన్నారు. మావోయిస్టులు చైనా సహకారంతోపాటు పాకిస్తాన్‌కు చెందిన ఐఎస్ఐ వంటి ఉగ్రవాద సంస్థల సహకారం ఇచ్చినట్లు గతంలో పలు సంఘటనలు రుజువయ్యాయన్నారు. లొంగిపోయినవారు మోసం చేసేందుకు వచ్చారో ఏమో తెలియదన్నారు. తమ పోరాటం తప్పుగా భావించి లొంగిపోయి ఉంటే మంచిదే అన్నారు. వీరి పరివర్తన వెనుక ఎవరున్నారనేది బహిరంగం కావాలన్నారు. ప్రభుత్వం ఏ ఆలోచన లేకుండానే లొంగిపోయినవారిని విచారణ జరిపించాలన్నారు. వీరు నిజమైన మావోయిస్టులు అయితే సమస్య లేదని, ప్రజాప్రభుత్వ సిద్ధాంతాలను వ్యతిరేకించారని జాతీయత, రాజ్యాంగ వ్యతిరేక పాలసీలను పాటించారన్నారు. వారికి బుల్లెట్‌లపై ఉన్న నమ్మకం బ్యాలెట్‌లపై లేదనేది తెలిసిందే అన్నారు. ఉన్నఫళంగా ఒకేసారి ఆరుగురు లొంగిపోవడం వెనుక ఉద్దేశం ఏమిటన్నారు. లబ్ధి పొందేందుకు వచ్చారా..? ఇతరత్రా కారణాలు ఏమైనా ఉన్నాయనేది కూడా విచారణలో తేల్చాలన్నారు.

బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సీనియర్ ఎమ్మెల్యే సునిల్ కుమార్ స్పందిస్తూ మావోయిస్టుల లొంగుబాటుపై పలు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. మావోయిస్టుల నియంత్రణ దళానికి లభించని నక్సల్స్ ఆచూకీ సీఎంకు ఎలా సాధ్యమైందన్నారు. మావోయిస్టులు చట్టం ముందు లొంగిపోవడం మంచిదే అన్నారు. వారు శాంతికోసం జనజీవనస్రవంతిలోకి ప్రజాసంఘాల నేతల ద్వారా సీఎం సమక్షంలో లొంగిపోవడం అనుమానాలకు కారణమవుతోందన్నారు. చట్టప్రక్రియకు ముందే ఏ, బీ, సీ అంటూ వర్గీకరణ చేసి ప్యాకేజీ ఎలా ప్రకటిస్తారన్నారు. సీఎం పిలుపుతో వారంలోనే లొంగిపోయే ప్రక్రియ ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. తద్వారా రాత్రింబవళ్లు తేడా లేకుండా అడవుల్లో కూంబింగ్ చేస్తూ ప్రజలను రక్షించాలనే లక్ష్యం కలిగిన మావోయిస్టులు నియంత్రణ దళం నైతిక స్థైర్యం కోల్పోయినట్లు కాదా..? అని ప్రశ్నించారు. బీజేపీ ఎమ్మెల్సీ రవికుమార్ బెంగళూరులో మాట్లాడుతూ మావోయిస్టులను ఆడంబరంగా తీసుకొచ్చి సీఎం సమక్షంలో లొంగిపోయినట్లు చూపడం ఎంతవరకు సరి అన్నారు. వారు చిక్కమగళూరు జిల్లా అధికారి ఎదుట లొంగిపోవాలని భావిస్తే కాదు కూడదని భారీ కాన్వాయ్ రూపంలో బెంగళూరుకు తీసుకొచ్చి సీఎం అధికారిక నివాసం వద్ద ఎలా లొంగిపోతారన్నారు. ఉపముఖ్యమంత్రి, హోం మంత్రుల సమక్షంలో లొంగిపోవడాన్ని ఏమని అర్థం చేసుకోవాలన్నారు. కాగా సీఎం సమక్షంలో మావోయిస్టులు లొంగిపోవడాన్ని ప్రశ్నించే బీజేపీ నేతలు హోం మంత్రి అమిత్‌షా సమక్షంలో లొంగిపోవడాన్ని ఎందుకు వ్యతిరేకించరని కాంగ్రెస్ ఎక్స్ ద్వారా ప్రశ్నించింది.

ప్రత్యేక నిధులు ఇవ్వండి: అంబికా

అనంతపురం అర్బన్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): పట్టుపరిశ్రమల అభివృద్ధి కోసం రాష్ట్రానికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని సెంట్రల్ సిల్క్ బోర్డు వైస్ చైర్మన్, బోర్డు సభ్యులకు అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ విన్నవించారు. బెంగుళూరులో గురువారం సెంట్రల్ సిల్క్ బోర్డు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీ అంబికా హాజరయ్యారు. ఏపీలో పట్టు పరిశ్రమ అభివృద్ధి కోసం పలు ప్రతిపాదనలు చేశారు. ఆయా అంశాలపై సిల్క్ బోర్డు వైస్ చైర్మన్‌కు వినతి పత్రం అందజేశారు. పట్టు రైతులకు ఇన్సెంటీవ్‌లు అందించేలా చూడాలని కోరారు. రీలింగ్ యూనిట్లకు జీఎస్టీని రద్దు చేయాలని, రేకుల షెడ్డు నిర్మాణ నిధులను రూ.4.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాలని విన్నవించారు. హిందూపురం పట్టుగూళ్ల మార్కెట్‌కు రూ.8 కోట్లు, పలమనేరు పట్టుగూళ్ల మార్కెట్‌కు రూ.5 కోట్లు మంజూరు చేయాలని కోరారు.



వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ అంబికా

ప్రకృతి పరవశం

నారు మళ్లు..
నీటి కయ్యలు..
దమ్ముచేసిన భూములు..
చెక్కిన గెనాలు..
చేను నిండా జనాలు..
బీళ్లకు పండగొచ్చింది..

ఎక్కడికెళ్లారో ఇన్నినాళ్లు..
ఏడ ఉన్నారో ఇన్నేళ్లు..
మళ్లీ వచ్చారు..
అనుకోని అతిథులు..
తెల్లతెల్లాని కొంగలు..
దమ్ముచేసిన చేలల్లో..
గుంపులుగుంపులుగా చేరి..
గుసగుసలాడుకుంటున్నారు..
రైతులతో.. ఊసులాడుతున్నారు..
నేస్తాలై..


తవళం ఆంజనేయస్వామి గుడి వద్ద పొలాల్లో కొంగల గుంపులు

నిన్నటిదాకా అవన్నీ బీడుభూములు. బీడుబారిపోయిన భూములు. జలం పొంగింది. బీళ్లను తడిపింది. అన్నదాతల్లో ఉత్సాహం నింపింది. ఆనందంగా పంటల సాగుకు శ్రీకారం చుట్టారు. తనకల్లు మండలంలోని చెన్నరాయస్వామి గుడి (సీజీ) ప్రాజెక్టు ఖరీఫ్‌లో పూర్తిగా నిండిపోయింది. ఆయకట్టుకు నీరు వదిలారు. దీంతో రైతులు వరి విస్తారంగా సాగుచేస్తున్నారు. అందుకు భూములను దమ్ము చేసుకుని, వరి నాట్లకు సిద్ధం చేసుకున్నారు. ఎక్కడి నుంచో కొంగల గుంపులు వచ్చి చేరాయి. భూమిలో నుంచి వచ్చే పురుగులను తింటూ రోజంతా భూముల్లోనే ఉంటున్నాయి. ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. తనకల్లు మండలంలోని తవళం గ్రామం వద్ద ఆంజనేయస్వామి ఆలయ సమీపాన భూముల్లో కొంగల గుంపులు చేరాయి. వాటిని చూసి జనం మైమరచిపోతున్నారు.

-తనకల్లు(ఆంధ్రజ్యోతి)

సంక్రాంతికి వస్తున్నాం..!

బడి నుంచి విద్యార్థుల ఊరి బాట






ఊరికి, ఇంటికి దూరంగా వచ్చేసిన బడి పిల్లలకు ఒక్కసారిగి రెక్కలు వచ్చాయి. సంచులు సర్దుకుని హాస్టల్ గదుల నుంచి రివ్వున గూటికి ఎగిరిపోయాయి. బస్సులో సీటు దొకగానే.. 'సంక్రాంతికి వస్తున్నాం..' అని తల్లిదండ్రులు, స్నేహితులకు సందేశం పంపించారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు శుక్రవారం నుంచి ఈ నెల 19వ తేదీ వరకు ప్రభుత్వం సంక్రాంతి సెలవులు ప్రకటించింది. దీంతో పండుగ కోసం ఊళ్లకు వెళ్లేవారితో జిల్లా వ్యాప్తంగా బస్టాండులన్నీ కిటకిటలాడాయి. బస్సు కనిపించగానే పరుగున వెళ్లి చుట్టుముట్టేశారు. కిటికీల నుంచి జేబు రుమాలు, సంచులు సీట్లలోకి విసిరేసి 'సంప్రదాయ రిజర్వేషన్' చేసేసుకున్నారు. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకూ రద్దీ కొనసాగింది. పండుగ నేపథ్యంలో ఆర్టీసీ అధికారులు రీజియన్‌లోని 7 డిపోల నుంచి 266 స్పెషల్ బస్సు సర్వీసులను వివిధ ప్రాంతాలకు నడుపుతున్నారు. అయినా, విద్యార్థులు, వారిని తీసుకెళ్లేందుకు వచ్చిన తల్లిదండ్రులు, సాధారణ ప్రయాణికుల రద్దీకి అవి సరిపడలేదు.


ఊర్లకు వెళ్లేందుకు అనంతపురం బస్టాండుకు చేరుకుంటున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు



- ఆంధ్రజ్యోతి, అనంతపురం కల్చరల్

సంక్రాంతికి స్పెషల్ రైళ్లు



గుంతకల్లు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని గుంతకల్లు మీదుగా ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు రైల్వే అధికారులు గురువారం తెలిపారు. సికింద్రాబాద్-అరిసికెరె (నంబరు 07231) ప్రత్యేక రైలు ఈ నెల 10వ తేదీ సాయంత్రం 7-05 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి, మరుసటి రోజు మధ్యాహ్నం ఒంటి గంటకు అరిసికెరెకు చేరుకుంటుంది. దీని తిరుగు ప్రయాణపు రైలు (నంబరు 07232) అరిసికెరెలో ఈ నెల 11న మధ్యాహ్నం 2 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం ఏడున్నరకు సికింద్రాబాద్‌కు చేరుకుంటుంది. సికింద్రాబాద్-అరిసికెరె (నంబరు 07233) ప్రత్యేక రైలు ఈ నెల 12వ తేదీ సాయంత్రం 7-05 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం ఒంటి గంటకు అరిసికెరెకు చేరుకుంటుంది. దీని తిరుగు ప్రయాణపు రైలు (నంబరు 07234) అరిసికెరెలో ఈనెల 11న మధ్యాహ్నం 2 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 8 గంటలకు సికింద్రాబాద్‌కు చేరుకుంటుంది. ఈ రెండు రైళ్లు లింగంపల్లి, వికారాబాద్, సేడం, క్రిష్ణ, రాయచూరు, మంత్రాలయం రోడ్డు, ఆదోని, గుంతకల్లు, అనంతపురం, ధర్మవరం, హిందూపురం, యలహంక, చిక్‌బనవూర్, తుమకూరు స్టేషన్ల మీదుగా ప్రయాణిస్తాయి. ఎస్ఎంవీటీ బెంగళూరు-కలబురగి (నంబరు 06519) ప్రత్యేక రైలు ఈ నెల 10, 11, 12 తేదీల్లో ఎస్ఎంవీటీ బెంగళూరు స్టేషన్‌లో రాత్రి 9-15 గంటలకు బయలుదేరి, మరుసటిరోజు ఉదయం 7-40 గంటలకు కలబురగికి చేరుకుంటుంది. దీని తిరుగు ప్రయాణపు రైలు (నంబరు 06520) కలబురగిలో ఈ నెల 11, 12, 13 తేదీల్లో ఉదయం 9-35 గంటలకు బయలుదేరి ఆయా రోజుల్లో రాత్రి 8 గంటలకు ఎస్ఎంవీటీ బెంగళూరు స్టేషన్‌కు చేరుకుంది. ఈ రైలు యలహంక, ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూరు, క్రిష్ణ, యాద్గిర్, షాహాబాద్ స్టేషన్ల మీదుగా ప్రయాణిస్తుంది.

హంసఫర్ ఎక్స్‌ప్రెస్ మరో 7 వారాలు రద్దు

గుంతకల్లు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు మీదుగా వెళ్లే తిరుపతి-జమ్మూతావి-తిరుపతి హంసఫర్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు రద్దును మరో ఏడు వారాలపాటు కొనసాగిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఉత్తర రైల్వే జోన్‌లోని జమ్మూ రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల కారణంగా ఒక అప్ అండ్ డౌన్ ట్రిప్పు రైలును ఈనెల 7, 10 తేదీల్లో రద్దుచేశారు. పనులు పూర్తికానందున మరో ఏడు వారాలపాటు సర్వీసుల రద్దును కొనసాగించాలని నిర్ణయించారు. తిరుపతి-జమ్మూతావి ఎక్స్‌ప్రెస్ (నంబరు 22705) రైలును ఈ నెల 14, 21, 28, ఫిబ్రవరి 4, 11, 18, 25 తేదీల్లో, దీని తిరుగు ప్రయాణపు రైలును (నంబరు 22706) ఈనెల 17, 24, 31, ఫిబ్రవరి 7, 14, 21, 28 తేదీల్లో రద్దు చేశారు.

కత్తి కల్చర్..!

పురంలో వరుస కత్తిపోట్ల ఘటనలు
కత్తి దగ్గర పెట్టుకుని తిరుగుతున్న కొందరు
బెంబేలెత్తుతున్న జనం



హిందూపురం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలన పుణ్యమాని పట్టణానికి కొత్త సంస్కృతి వచ్చిపడింది. ప్రశాంతతకు మారుపేరైన హిందూపురంలో కత్తి కల్చర్ పురుడు పోసుకుంది. కొందరు కత్తులను దగ్గర పెట్టుకుని, తిరుగుతున్నారు. ఇటీవలిగా వరుస కత్తిపోట్ల ఘటనలే ఇందుకు నిదర్శనం. మండలంలో ఏడాది క్రితం రాత్రిపూట ద్విచక్రవాహనంలో వస్తున్న వ్యక్తిని దుండగులు అడ్డగించారు. అతడి వద్దనున్న డబ్బు, వాహనాన్ని లాక్కుని, గొంతుకోసి వెళ్లిపోయారు. తీవ్ర గాయాలతో పడి ఉన్న అతడిని అటుగా వెళ్తున్నవారు గమనించి, పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఆస్పత్రికి తరలించి చికిత్సలు అందించారు.

మారని తీరు..

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఇక్కడ పనిచేసిన పోలీసు అధికారులు అధిక శాతం సమయం వైసీపీ నాయకుల సేవలో తరించడానికి సరిపోయింది. నేరం జరిగినా పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరించారు. దీంతో నేరస్థులు చెలరేగిపోయారు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం ఏర్పడినా కొంతమంది నేరస్థుల్లో భయంలేకుండా పోయింది. వారం క్రితం రౌడీషీటర్‌గా ఉన్న వ్యక్తి ఓ ఇంటి అద్దాలు పగులకొట్టాడు. మరో రౌడీషీటర్‌కు భయపడి నిందితుడిపై కేసు కట్టడానికి పోలీసులు నిరాకరించారు. దీంతో బాధితులు రోడ్డెక్కి ధర్నా చేయాల్సిన పరిస్థితి వచ్చింది. దీనిని బట్టి ఇప్పుడు కూడా నేరస్థులు ఎంతగా రెచ్చిపోతున్నారో అర్థమవుతోంది.

ఆత్మరక్షణ కోసం చిన్నపాటి కత్తులు

ఎన్నడూలేని విధంగా హిందూపురంలో ఒక వర్గానికి చెందినవారు ఆత్మరక్షణ కోసం చిన్నపాటి కత్తులు ఉంచుకుంటున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. పట్టణంలో ఐదు కత్తిపోట్ల ఉదంతాలు వెలుగు చూడగా.. అందులో ఇరువైపులా తొమ్మిదిమంది గాయపడ్డారు. కత్తి దాడుల నేపథ్యంలో జనం బెంబేలెత్తుతున్నారు. కత్తులతో సయ్యాట ఎక్కడికి దారితీస్తుందోనని పట్టణవాసులు భయపడుతున్నారు. వారం క్రితం ఆర్టీసీ కాలనీలో జరిగిన ఘటనను పరిశీలిస్తే అతడు నిత్యం కత్తి దగ్గర పెట్టుకుని తిరుగుతున్నట్లు పోలీసులే చెప్పడం గమనార్హం. హిందూపురంలో ఇంకెంతమంది కత్తులు పెట్టుకుని తిరుగుతున్నారోనన్న ఆందోళన ప్రజల్లో నెలకొంది. కత్తి కల్చర్ మంచిదికాదనీ, వెంటనే అరికట్టాలని జనం కోరుతున్నారు.

ఇటీవల కత్తిపోట్ల ఘటనలు ఇవీ..

- నాలుగు నెలల క్రితం మోతుకపల్లి వద్ద ఇద్దరు స్నేహితులు గంజాయి మత్తులో కత్తితో పొడుచుకున్నారు. కత్తితో గొంతు కోయడానికి సైతం ప్రయత్నించారు.
- ఇటీవల హిందూపురం వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తికి గొంతు కోయడంతో తీవ్ర రక్తస్రావమై, ఆస్పత్రి పాలయ్యాడు.
- పట్టణంలోని రహమత్‌పురంలో ఇటీవల మూడు నెలల వ్యవధిలో మూడు ఘటనలు జరిగాయి. కత్తులతో గొంతు కోసుకుని, పొత్తి కడుపులో పొడుచుకుని తీవ్రగాయాలతో ఆస్పత్రుల పాలయ్యారు.
- తాజాగా ఆర్టీసీ కాలనీలో ఇలాంటి ఘటన జరిగింది. ఈనెల 7న అర్ధరాత్రి హిందూపురం-లేపాక్షి ప్రధాన రహదారిలోని కొల్లకుంట చెరువు కట్టకింద ముద్దిరెడ్డిపల్లి ప్రాంతానికి చెందిన వ్యక్తిని గొంతుకోసి హత్య చేయడానికి ప్రయత్నించారు. ఇవి మచ్చుకు మాత్రమే. గత ఐదేళ్లలో ఇలాంటివి చాలానే జరిగాయి.

టమోటా కిలో రూ.11

అనంతపురం రూరల్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.11తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు గురువారం 630 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.9, కనిష్ఠ ధర రూ.7 పలికినట్లు ఆయన తెలిపారు.

సదరం క్యాంపులు రద్దు

అనంతపురం టౌన్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): జిల్లా సర్వజన ఆస్పత్రిలో సదరం మెడికల్ క్యాంపుల నిర్వహణను తాత్కాలికంగా రద్దు చేశామని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు గురువారం తెలిపారు. ఫించన్లకు సంబంధించిన వైకల్య మెడికల్ సర్టిఫికెట్ల జారీ కోసం వారానికి మూడురోజులు సదరం మెడికల్ క్యాంపులను ఆస్పత్రిలో నిర్వహించామని, ఇప్పటి వరకూ మంజూరు చేసిన సర్టిఫికెట్ల రీ వెరిఫికేషన్ జరుగుతోందని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు కొత్త వైకల్య మెడికల్ సర్టిఫికెట్ల జారీని నిలిపేశామని ఆయన తెలిపారు. ప్రభుత్వం నుంచి మళ్లీ ఆదేశాలు వచ్చిన తర్వాత తిరిగి సదరం మెడికల్ క్యాంపులు నిర్వహిస్తామని తెలిపారు. అప్పటివరకూ ఎవరూ సదరం సర్టిఫికెట్ల కోసం ఆస్పత్రికి రావద్దని సూచించారు.

గొర్రెల మందపై దూసుకెళ్లిన
ఆయిల్ ట్యాంకర్
13 గొర్రెల మృతి.. కాపరి పరిస్థితి విషమం


ప్రమాదంలో మృతిచెందిన గొర్రెలు

బత్తలపల్లి, జనవరి9(ఆంధ్రజ్యోతి): మండలంలోని జ్వాలాపురం స్టేజ్ సమీపాన గురువారం గొర్రెల మందపై ఆయిల్ ట్యాంకర్ దూసుకెళ్లడంతో 13 జీవాలు మరణించగా.. కాపరి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కోడేకండ్ల గ్రామానికి చెందిన ఓబుళపతి గొర్రెలు మేపుకుంటూ జీవనం సాగించేవాడు. దినచర్యలో భాగంగా గురువారం గొర్రెలను మేపునకు తోలుకెళ్లాడు. జ్వాలాపురం స్టేజ్ సమీపాన గొర్రెలు రోడ్డు దాటుతుండగా ఆయిల్ ట్యాంకర్ వాటిపై దూసుకెళ్లింది. ప్రమాదంలో 13 గొర్రెలు మృతిచెందాయి. కాపరి ఓబుళపతి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని అటుగా వెళ్లే వాహనదారులు 108 సాయంతో ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురం తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ సోమశేఖర్ ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు. ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

వ్యవసాయ శాఖ మంత్రి ఆరా

ప్రమాద విషయం తెలుసుకున్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఆరా తీశారు. గాయపడిన గొర్రెల కాపరికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. గొర్రెల కాపరి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ప్రమాదంపై నివేదిక ఇవ్వాలని పశుసంవర్ధక శాఖాధికారులను మంత్రి ఆదేశించారు.

ఆశా కార్యకర్త అనుమానాస్పద మృతి


నసీమా (ఫైల్)

హిందూపురం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మోడల్ కాలనీలో ఆశా కార్యకర్త నసీమా (40) బుధవారం అర్ధరాత్రి సమయంలో ఇంట్లోనే అనుమానాస్పద స్థితిలో మరణించినట్లు టూటౌన్ సీఐ అబ్దుల్ కరీం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నసీమా 12ఏళ్ల క్రితం భర్త నుంచి విడిపోయి మేళాపురంలో నివాసముండేది. మోడల్ కాలనీకి చెందిన హైదర్‌తో పరిచయం ఏర్పడి, తరువాత అతడితో సహజీవనం చేస్తుండేది. హైదర్‌కు భార్య ఉంది. అందరూ కలిసి ఒకే ఇంట్లో ఉంటున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం అర్ధరాత్రి దాటాక నసీమా ఇంటి పైకప్పునకు ఉరివేసుకుంది. ఉదయం హైదర్ నిద్రలేచి చూడగా.. నసీమా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. మృతదేహాన్ని కిందకు దించి, పోలీసులకు సమాచారం ఇచ్చాడు. రూరల్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని హిందూపురం ఆస్పత్రికి తరలించారు. నసీమాకు ఇద్దరు కుమారులున్నారు. పెద్ద కుమారుడు తబ్రేజ్.. తన తల్లిని హైదర్ చంపి ఆత్మహత్యగా చిత్రీకరించాడని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని సీఐ అబ్దుల్ కరీం తెలిపారు.

యువతి పట్ల అసభ్య ప్రవర్తన

మగ్గాల నిర్వాహకుడిపై కేసు

ధర్మవరం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): కడపజిల్లా జమ్మలమడుగుకు చెందిన ఓ యువతి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన పట్టణానికి చెందిన చేనేత మగ్గాల నిర్వాహకుడు ఆదిశేషుపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ గురువారం తెలిపారు. జమ్మలమడుగుకు చెందిన హసీనాతో ఆదిశేషుకు సోషల్ మీడియాలో పరిచయం ఏర్పడింది. ధర్మవరంలో తనకు డబ్బు ఇవ్వాలని ఆమె.. ఆదిశేషుతో చెప్పింది. తాను పోలీసుననీ, డబ్బు ఇప్పిస్తానని అతడు నమ్మబలికాడు. కారులో జమ్మలమడుగుకు వెళ్లి ఆమెను పిలుచుకుని ఈనెల 8న ధర్మవరం వచ్చాడు. పట్టణ సమీపంలో ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో ఆమె వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ మేరకు ఆదిశేషుపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

చేలపై డ్రోన్లు..!

సాంకేతికతకు కూటమి ప్రభుత్వం పెద్దపీట

- జిల్లాకు 35 కిసాన్ డ్రోన్ల మంజూరు
- 80 శాతం రాయితీ వర్తింపు
- గత వైసీపీ పాలనలో ఒక్కటీ అందని వైనం

ధర్మవరం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): వ్యవసాయానికి పెద్దపీట వేస్తాం, యాంత్రీకరణ పద్ధతి ద్వారా వ్యవసాయం రూపురేఖలు మారుస్తామంటూ గత వైసీపీ ప్రభుత్వ పెద్దలు.. సభలు, సమావేశాలలో ఊదరగొట్టారు. మరో అడుగు ముందుకేసి కిసాన్ డ్రోన్లను రైతులకు అందిస్తామని సాక్ష్యాత్తు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కోతలు కోశారు. ఐదేళ్లలో ఒక్కటంటే ఒక్కటి కూడా రైతులకు చేరువకాలేదు. 2024లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం గత వైసీపీ పాలనలో వ్యవసాయానికి జరిగిన నష్టాలను పూడ్చే పనిలో నిమగ్నమైంది. అందులో డ్రిప్, స్ప్రింక్లర్ల పరికాలను తొలి విడత కింద సబ్సిడీతో మంజూరు చేస్తోంది. వ్యవసాయానికి సాంకేతిక పరిజ్ఞానం జోడిస్తూ కూటమి ప్రభుత్వం కిసాన్ డ్రోన్లను సబ్సిడీ కింద అందజేసేందుకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా శ్రీసత్యసాయి జిల్లాకు 35 కిసాన్ డ్రోన్లను పైలెట్ ప్రాజెక్టు కింద తొలి విడతలో మంజూరు చేసింది.

కిసాన్ డ్రోన్లు పొందవచ్చు ఇలా..

భూములున్న రైతులు ఈ పథకానికి అర్హులు. 2.50 ఎకరాలకుపైగా భూమి ఉండాలి. ఐదు నుంచి పది మంది రైతులు కమిటీగా ఏర్పడాలి. డ్రోన్ ఆపరేటర్‌కు 18 ఏళ్ల నుంచి 45 ఏళ్ల వయసు ఉండాలి. మెడికల్ ఫిట్‌నెస్ తప్పనిసరి. పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. వారికి అమరావతిలోని ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 12 రోజులపాటు కిసాన్ డ్రోన్ ఆపరేటింగ్‌పై శిక్షణ ఇస్తారు. అనంతరం వారికి ప్రభుత్వం పైలెట్ లైసెన్స్ అందజేస్తుంది. కిసాన్ డ్రోన్ ఆపరేటింగ్, మెకానిజంపై శిక్షణ ఇస్తారు.



సబ్సిడీతో పంపిణీ

కిసాన్ డ్రోన్లను సబ్సిడీతో పంపిణీ చేయనున్నట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ప్రస్తుతానికి యూనిట్ ధర రూ.10 లక్షలుగా నిర్ణయించారు. ఇందులో 80 శాతం అంటే రూ.8 లక్షలు సబ్సిడీ వర్తింపజేస్తారు. మిగిలిన రైతులు తమ వాటాగా చెల్లించాల్సి ఉంటుంది. కిసాన్ డ్రోన్‌కు సంబంధించి అదనంగా నాలుగు బ్యాటరీలు, రెండు చార్జర్లు, నాలుగు నాజిల్స్, రెండు ల్యాండింగ్ గేర్స్, అదనపు ప్రొపెల్లర్స్ ఒక సెట్ (6), టూల్‌కిట్ 1, ఏడాదికి డ్రోన్‌కు వారెంటీ అందుతాయి.

మహిళలకు నమో డ్రోన్ పథకం

మహిళలను వ్యవసాయ రంగంలో కూడా భాగస్వాములను చేయాలన్న ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నమో డ్రోన్ పథకాన్ని అమలు చేస్తున్నాయి. శ్రీసత్యసాయి జిల్లాలో డీఆర్‌డీఏ ద్వారా ఆరుగురు మహిళలను ఎంపిక చేస్తామని జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు తెలిపారు. దరఖాస్తులను పరిశీలించి, ఎంపిక చేస్తామన్నారు. అందులో డ్రోన్ పైలెట్ ట్రైనీని ఎంపిక చేసి, డ్రోన్ ఆపరేటింగ్ శిక్షణ కోసం అమరావతిలోని ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయానికి పంపుతామన్నారు. అక్కడ శిక్షణ ఇచ్చి పైలెట్ లైసెన్స్ అందజేస్తారన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కొంచ్...

పింగళి లక్ష్మీకాంతం (జయంతి - వర్ధంతి)



ప్రసిద్ధ తెలుగు కవి పింగళి లక్ష్మీకాంతం 1894 జనవరి 10న కృష్ణా జిల్లా ఆర్తమూరు గ్రామంలో జన్మించారు. కాటూరి వెంకటేశ్వరరావుతో కలసి ఆంజనేయ స్వామిపై శతకం చెప్పారు. పింగళి కాటూరి జంట కవులుగా పలుచోట్ల శతావధానాలు చేశారు. కాగా పాండవోద్యోగ విజయములు, ముద్రా రాక్షసము నాటకాలలో ధర్మరాజు, రాక్షసమంత్రిగా పాత్రలలో రాణించి ప్రశంసలు పొందారు. ఆంధ్ర విశ్వకళా పరిషత్, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలోనూ ఆంధ్రా చార్యులుగా, అధ్యక్షులుగా వ్యవహరించారు. కేంద్ర సాహిత్య అకాడమీ కార్యవర్గ సభ్యులుగా వ్యవహరించారు. 1972 జనవరి 10న పరమపదించారు. ఇలా జయంతి, వర్ధంతిలు ఒకే తేదీన రావడం కాకతాళీయం.

కేజే ఏసుదాసు (పుట్టినరోజు)



గాన గంధర్వుడిగా పేరొందిన కట్టస్సేరి జోసెఫ్ ఏసుదాసు 1940 జనవరి 10న కేరళ రాష్ట్రం కొచ్చిన్‌లో జన్మించారు. భారతీయ శాస్త్రీయ సంగీత కళాకారుడు, సినీ నేపథ్యగాయకుడు. ఐదు దశాబ్దాల కళా జీవితంలో తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, బెంగాలీ, ఒరియా భాషలతోపాటు అరబిక్, ఆంగ్లం, లాటిన్, రష్యన్ భాషలలో సుమారు 80 వేల పాటలు పాడారు. 14 భాషల్లో సినిమాలు, ప్రైవేట్ ఆల్బమ్‌లు, భక్తి పాటలు కలిపి లక్షకుపైగా పాటలు పాడారు. శబరిమలై అయ్యప్పస్వామి ఆలయంలో పవళింపు వేళ పాడే 'హరివరాసనం' పాట ఎంతో పేరొందింది. పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్, సంగీత నాటక అకాడమీ అవార్డు, 8సార్లు జాతీయ ఉత్తమ గాయకుడి పురస్కారం, ఇతర రాష్ట్రాలచే 43సార్లు ఉత్తమగాయకుడి పురస్కారాలు, ఫిలింఫేర్ అవార్డ్స్ సౌత్ 5, ఇతర గౌరవాలు, సత్కారాలు పొందారు.

అల్లు అరవింద్ (పుట్టినరోజు)



ప్రముఖ సినీ నిర్మాత అల్లు అరవింద్ 1949 జనవరి 10న పశ్చిమగోదావరి జిల్లా పాల కొల్లులో జన్మించారు. 'పద్మశ్రీ' గ్రహీత దివంగత అల్లు రామ లింగయ్య కుమారుడు. దాదాపు ఐదు దశాబ్దాలుగా గీతా ఆర్ట్స్ బ్యానరుపై తెలుగు సినిమాలు నిర్మిస్తున్నారు. కొన్ని సినిమాలలో కూడా నటించారు. 2020లో డిజిటల్ ఓటీటీలోకి అడుగుపెట్టి 'ఆహా' పేరుతో తెలుగుకు ఒక గుర్తింపు తెచ్చారు. ఇండియన్ సూపర్‌లీగ్ క్లబ్ కేరళ బ్లాస్టర్స్ ఎఫ్‌సీకి కో-ఓనర్‌గా ఉన్నారు. సంతోషం దాసరి స్మారక అవార్డు పొందారు. కాగా ఆయన కుమారుడు అల్లు అర్జున్ టాలీవుడ్‌లో ప్రముఖ హీరోగా కొనసాగుతున్నారు.

రాకేశ్ చౌరాసియా (పుట్టినరోజు)



ప్రముఖ వేణుగాన విద్వాంసుడు రాకేశ్ చౌరాసియా 1971 జనవరి 10న ఉత్తరప్రదేశ్ రాష్ట్రం అలహాబాద్‌లో జన్మించారు. హిందూస్తానీ సంగీతంలో రాణించారు. హరిప్రసాద్ చౌరాసియాకు మేనల్లుడు. ఇండియన్ మ్యూజిక్ అకాడమీ అవార్డు, ఆదిత్య బిర్లా కళాకిరణ్ పురస్కార్, గురుశిష్య అవార్డు, పండిట్ జస్‌రాజ్ సంగీత రత్న అవార్డు తదితర పురస్కారాలు అందుకున్నారు.

హృతిక్ రోషన్ (పుట్టినరోజు)



హృతిక్ రోషన్ 1974 జనవరి 10న ముంబైలో జన్మించారు. తండ్రి రాకేశ్ రోషన్ సినీ నిర్మాత, దర్శకుడు. 1980 దశకంలో బాల నటుడిగా నటించిన హృతిక్, తండ్రి రాకేశ్ దర్శకత్వం వహించిన కహోనా ప్యార్ హై (2000) సినిమాతో తెరంగేట్రం చేశారు. ఇప్పటివరకు 6 ఫిలింఫేర్ పురస్కారాలు అందుకున్నారు. బాలీవుడ్‌లో టాప్ హీరోగా అత్యధిక పారితోషికం అందుకుంటున్నారు. యునిసెఫ్‌కు ఇండియా నుంచి బ్రాండ్ అంబాసిడర్‌గా ఉన్నారు.

మార్కెట్‌లోకి రెడ్‌మీ 14సీ విడుదల

బెంగళూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మొబైల్ రంగంలో పేరొందిన షియోమి ఇండియా ద్వారా రెడ్‌మి 14సి, రెడ్‌మి నోట్ 14 బ్రాండ్లను లాంచనంగా మార్కెట్‌లోకి విడుదల చేశారు. బడ్జెట్ స్మార్ట్‌ఫోన్ విభాగంలో 5జి సిరీస్‌లో రెండు కొత్త మోడల్స్ విడుదల చేసినట్టు గురువారం బెంగళూరులో ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెండు వారాలలో వెయ్యికోట్ల మైలురాయిని అధిగమించినట్టు ప్రకటించారు. రెండు ఫోన్లు అత్యాధునిక ఫీచర్లు కలిగి ఉన్నాయని, డ్యూయల్ కెమెరా సిస్టమ్‌తోపాటు బ్యాటరీ ఎక్కువమన్నిక వచ్చేలా ఉన్నట్టు ప్రకటనలో తెలిపారు. శుక్రవారం నుంచి ఆన్‌లైన్, రిటైల్‌లో అందుబాటులోకి రానుందన్నారు.

సమాజ సేవకుడు రమేశ్‌కు గౌరవ డాక్టరేట్



రమేశ్ రాజనహళ్ళి

బెంగళూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సూర్య కిరణ్ ప్రతిష్ఠాన పేరిట సామాజిక సేవ చేస్తున్న రమేశ్ రాజనహళ్ళికి అమెరికా దేశం బోస్టన్‌లోని కేంబ్రిడ్జ్ డిజిటల్ యూనివర్సిటీ గౌరవ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను ప్రకటించింది. సూర్యకిరణ్ ప్రతిష్ఠాన ద్వారా బెంగళూరులోని కిద్వాయ్ ఆసుపత్రిలో కేన్సర్ రోగులకు ఉచిత భోజన సదుపాయం, డయాబెటిక్ హెల్త్‌క్యాంప్‌లు, 58 వేలమందికి కంటి పరీక్షలు, 22వేలమందికి కాటరాక్ట్ సర్జరీలు జరిపించారు. రెండు వృద్ధాశ్రమాలను దత్తత తీసుకుని వారికి అవసరమైన సౌలభ్యాలు కల్పించడం వంటి సామాజికసేవలను రెండు దశాబ్దాలకుపైగా చేసిన మేరకు గౌరవ డాక్టరేట్‌కు ఎంపిక చేశారు. రమేశ్ రాజనహళ్ళిని గురువారం పలువురు అభినందించారు. సామాజిక సేవలకుగాను గౌరవ డాక్టరేట్‌కు ఎంపిక కావడంపై పలు ప్రశంసించారు. మరింతగా కొనసాగించాలని అభిలషించారు.

ప్రత్యేక బిజినెస్ పాలసీ అవసరం

నీతి ఆయోగ్ మాజీ సీఈఓ అమితాబ్‌కాంత్



సదస్సులో నీతిఆయోగ్ మాజీ సీఈఓ అమితాబ్‌కాంత్ తదితరులు

బెంగళూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): విదేశాలలోని భారత పారిశ్రామికవేత్తలను దేశానికి రప్పించేలా ప్రత్యేక పాలసీని రూపొందించాల్సిన అవసరం ఉందని నీతి ఆయోగ్ మాజీ సీఈఓ అమితాబ్‌కాంత్ అభిప్రాయపడ్డారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్‌సి) డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజిమెంట్ స్టడీస్, కెనడా యూనివర్సిటీ ప్రసార్‌వెల్లి సహకారంతో 'సొంత పరిశ్రమ, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో వాణిజ్యవిధానం, పారిశ్రామికవేత్తల వాపసు' అనే అంశంపై రీన్ 2025 పేరిట ఏర్పాటైన సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. పొరుగు దేశం చైనాలో ప్రతిభను కాపాడు కునేం దుకు ప్రత్యేక బిజినెస్ పాలసీ ఉందన్నారు. తద్వారా సైన్స్, సాంకేతిక రంగంలో సాధనలు సాధిస్తున్నారని, అటువంటి విధానం మనదేశంలో కూడా అమలు చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. దేశంలో ఇతరదేశాలకంటే ఎక్కువ జ్ఞానవంతులు, పెట్టుబడిదారులు, మౌలిక సదుపాయాలు ఉన్నా వీటిని పూర్తిగా సద్వినియోగం చేసుకోవడంలో సరైన విధానాలు లేవన్నారు. వియోనిక్స్ బయోసైన్స్ సీఈఓ వివేక్ వాధ్వా మాట్లాడుతూ మనదేశానికి చెందిన ప్రముఖ కంపెనీలు అమెరికాలో ఉన్నాయన్నారు. పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేలా ప్రధాని నరేంద్రమోదీ పలు పథకాలు అమలు చేశారన్నారు. భారత్‌కు చెందిన 2వేల మంది విద్యార్థులు అమెరికాలో చదువుతున్నారన్నారు. భారత్‌కు చెందిన 5లక్షల మందికిపైగా వ్యక్తులు అమెరికాలో వివిధ రకాల సంస్థలు, పరిశ్రలమ ఏర్పాటుకు అనుమతికోసం వేచియున్నారన్నారు. చర్చాగోష్ఠిలో విద్యా నిపుణులు, స్టార్టప్ సంస్థాపకులు, ప్రభుత్వ అధికారులు, పారిశ్రామికవేత్తలు పలువురు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఐఐఎస్‌సికి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ ఎంహెచ్ బాలసుబ్రమణ్య, కెనడా యూనివర్సిటీ సహాయక ప్రొఫెసర్ డాక్టర్ జాన్‌థామస్, సలహా సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కెఎల్ కృష్ణ, ట్రైకా కంపెనీ సీఈఓ శాంతి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కొడవ కుటుంబ హాకీకి గిన్నిస్ రికార్డు

అభినందించిన ముఖ్యమంత్రి



చెక్కు అందజేస్తున్న సీఎం సిద్ధరామయ్య

బెంగళూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): కొడగు జిల్లాలో నివసించే కొడవ సామాజికవర్గానికి చెందిన వారికి హాకీ క్రీడ ప్రాచుర్యంలో ఉంది. కొడవ కుటుంబీకుల హాకీకి గిన్నిస్‌బుక్ రికార్డు దక్కడంపై సీఎం సిద్ధరామయ్య ప్రత్యేకంగా అభినందించారు. గురువారం అధికారిక నివాసం కృష్ణలో కొడగులో హాకీ క్రీడ అభివృద్ధికోసం యువజనుల విభాగం నుంచి కోటి రూపాయల గ్రాంటు చెక్కును అందించారు. కొడగులో ఏటా జాతీయస్థాయిలో హాకీ పోటీలు నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది. మంత్రులు శరణప్రకాశ్ పాటిల్, బైరతి సురేశ్, కొడగు ఎమ్మెల్యే పొన్నణ్ణ, చీఫ్ సెక్రటరీ శాలిని రజనీశ్‌తోపాటు కొడవ సామాజికవర్గానికి చెందిన మహిళలు పాల్గొన్నారు.

నేడు ముక్కోటి ఏకాదశి



సిద్ధమవుతున్న లడ్డూలు

విజయపుర, జనవరి 9(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి పర్వదినానికి స్థానిక అన్ని ప్రముఖ ఆలయాలలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. దేవనహళ్ళి తాలూకా విజయపుర పట్టణంలో ప్రముఖమైన హార్డిపుర లక్ష్మీ వేంకటరమణ స్వామి ఆలయంలో భక్తులకోసం 10వేల లడ్డూలను సిద్ధం చేస్తున్నారు. బెంగళూరు గ్రామీణ జిల్లాలో ఆలయాల నగరిగా పేరొందిన విజయపుర పట్టణం సాంస్కృతిక ధార్మిక కార్యక్రమాలకు నెలవుగా కొనసాగుతోంది. హార్డిపుర లక్ష్మీవేంకటరమణస్వామి ఆలయం స్థానికంగా పేరొందింది. ప్రతి శనివారం, శ్రావణమాసం, కార్తీక మాసం, ధనుర్మాసాలలో విశేషపూజలు కొనసాగుతాయి. ప్రస్తుతం వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్వామివారికి విశేష పూజలు, అలంకరణ ఉంటాయని ఆలయ అభివృద్ధి సమితి అధ్యక్షుడు ఎం శ్రీనివాసప్ప తెలిపారు. పంచామృతాభిషేకం అనంతరం ఉత్తరద్వార దర్శనం ఉంటుందన్నారు. సంగీత కార్యక్రమాలు, పతంజలి యోగ శిక్షణ సమితి ఆధ్వర్యంలో విష్ణుసహస్రనామ పారాయణ, గోవిందాష్టకం తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు.

శిడ్లఘట్ట తాలూకాలో...

శిడ్లఘట్ట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో అనాదికాలంగా ఉన్న వాసవిరోడ్డులోని శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి, ద్వాదశికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. శుక్రవారం సుప్రభాత సేవ అనంతరం భక్తులకు వైకుంఠ ద్వారం ద్వారా దర్శనానికి అవకాశం కల్పించనున్నారు. శుక్రవారం రాత్రి 11 గంటల వరకు, శనివారం కూడా దర్శన అవకాశం ఉంటుందని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. కాగా పట్టణంలోని ఫిలేచర్ క్వార్టర్స్‌లోని కల్యాణవెంకటేశ్వరస్వామి దేవస్థానం, తలకాయల బెట్టపై కొలువైన లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయాల్లోనూ విశేష పూజలు, అలంకరణలు జరుగనున్నాయి.

ఘనంగా కువెంపు జయంతి

దొమ్మసంద్ర, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఆనేకల్ తాలూకా సర్జాపురలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ క్రీడామైదానంలో జయకర్ణాటక సంఘం ఆనేకల్ తాలూకా యు విభాగం అధ్యక్షుడు డాక్టర్ బీఎస్ నవీన్ నేతృత్వంలో కన్నడ రాజ్యోత్సవం, జాతీయ కవి కువెంపు జయంతి కార్యక్రమం ఘనంగా జరిగింది. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బిఎన్ జగదీశ్, నటుడు నెనపిరలి ప్రేమ్‌లు ప్రారంభించారు. జాతీయకవి కువెంపు సాధనలను పలువురు వక్తలు ప్రస్తావించారు. నేటి యువత కూడా సాహిత్యంలో రాణించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వివిధ రంగాల సాధకులకు సేవారత్న పురస్కారాలతో సత్కరించారు. సర్జాపుర గ్రామ పంచాయతీలో సేవలందిస్తున్న ఉద్యోగులకు, పౌరకార్మికులకు యూనిఫాం, మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం కార్యాధ్యక్షుడు రామచంద్ర, ఉపాధ్యక్షుడు అంబరీశ్, మహిళా విభాగం ఉపాధ్యక్షుడు నిశా, బెంగళూరు నగర జిల్లా అధ్యక్షుడు యోగానంద, ఆనేకల్ తాలూకా అధ్యక్షుడు కిరణ్ ప్రభాకర్‌రెడ్డి, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.



వేదికపై ప్రముఖులు

17 నుంచి త్రివేణి సంగమంలో 'మహిళా ధ్యాన మహాచక్ర'



మీడియా సమావేశంలో వివిధసంఘాల ప్రముఖులు

బెంగళూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ధ్యాన ఆధ్యాత్మిక వచన ప్రాధాన్యత అందరికీ అందుబాటులోకి తీసుకురావాలని ఈనెల 17నుంచి మూడు రోజులపాటు బాగల్కోట జిల్లా హుణగుంద తాలూకా త్రివేణి సంగమం అనుభవమండపంలో మహిళా ధ్యాన మహాచక్ర, వచన ధ్యాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ప్రకటించారు. బెంగళూరు విశ్వచైతన్య ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రకాశ్ బాబు, పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ మూమెంట్ ప్రతినిధులు మీడియాకు తెలిపారు. మూడు రోజులపాటు జరిగే ధ్యాన, వచన కార్యక్రమాలలో ప్రముఖ స్వామిజీలతోపాటు రాజకీయ ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు.

అమిత్‌షా వ్యాఖ్యలను నిరసిస్తూ ధారవాడ బంద్

బెంగళూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పట్ల కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అనుచితమైన వ్యాఖ్యలను నిరసిస్తూ వివిధ దళితసంఘాలు ధారవాడ బంద్‌కు పిలుపునిచ్చాయి. గురువారం హుబ్బళ్ళి-ధారవాడ జంట నగరాలలో బలవంతంగా బంద్ జరిపించారు. ఉదయం 6 గంటలనుంచే దళితసంఘాల కార్యకర్తలు, ముఖ్యులు బంద్ చేయించేందుకు ద్విచక్రవాహనాలలో ర్యాలీ చేశారు. పలుచోట్ల దుకాణాలను బలవంతంగా మూసివేయించారు. శ్రీనగర్ సర్కిల్‌లో కొట్టు ద్వారా హోటల్ నడుపుతున్న వ్యక్తిని బంద్ చేయాలంటూ దాడి చేశారు. సిద్దప్ప కంబళి లా కాలేజ్‌లో ప్రవేశించి విద్యార్థులను బయటకు పంపారు. నగరమంతటా బంద్ వాతావరణం కొనసాగింది.



ఆందోళనకారుల బైక్ ర్యాలీ

వ్యవసాయంలో సవాళ్లపై దృష్టి సారించాలి

● పరిశోధకులకు బెంగళూరు వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ ఎస్‌వీ సురేశ్ సూచన

రాయచూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగం భవిషత్తులో ఎదుర్కొనే సమస్యలను పరిష్కరించేందుకు పరిశోధకులు, విజ్ఞాన శాస్త్రవేత్తలు ఇప్పుడే దృష్టి సారించాలని బెంగళూరు వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ డా.ఎస్‌వీ సురేశ్ సూచించారు. బెంగళూరు-రాయచూరు వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో గురువారం నగరంలోని వ్యవసాయ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన సుస్థిర వ్యవసాయం వ్యవసాయ విస్తరణ కోసం చేపట్టే అంశాలకు సంబంధించి జాతీయ స్థాయి సమ్మేళనం నిర్వహించారు. సమ్మేళనాన్ని ప్రారంభించిన డా.ఎస్‌వీ సురేశ్, స్వాతంత్ర్య అనంతరం దేశంలో ఆహార కొరతను అధిగమించేందుకు హరిత విప్లవం సాధించామని అదే దోరణి మరోసారి పునరావృతం కావల్సి ఉందన్నారు. ప్రస్తుతం వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న అనేక సవాళ్లను ఎదుర్కొనేందుకు శాస్త్రవేత్తలు సిద్ధం కావాలన్నారు. సాగు విస్తీర్ణం తగ్గడం దిగుబడులు తగ్గిపోవడంతో పాటు విచ్చల విడిగా వినియోగిస్తున్న రసాయనిక ఎరువులు పంటపొలాలను ఆశిస్తున్న తెగుళ్ల చేడపుడుండ బాదలు దీంతో పాటు పెరుగుతున్న సాగు పెట్టుబడి తదితర అంశాల పై శాస్త్రవేత్తలు పరిశోధకులు దృష్టి సారించాల్సి ఉందన్నారు. ఆ దిశగా రైతులను, ప్రజలను జాగృతం చేయడం ద్వార వ్యవసాయ రంగంలో భవిషత్తులో ఎలాంటి సంక్షోభం తలెత్తకుండా ఇప్పటి నుంచే తగిన పరిష్కారాలు చూపించాల్సి ఉందన్నారు.



మాట్లాడుతున్న బెంగళూరు వీవీ వీసీ డా.ఎస్‌వీ సురేశ్

పరీక్షల్లో అక్రమాల సూత్రధారి

ఆర్‌డీ పాటిల్‌కు సుప్రీం షాక్

బెయిల్ నిరాకరించిన ధర్మాసనం

బెంగళూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఎఫ్‌డిఎ (ఫస్ట్ డివిజన్ అసిస్టెంట్) పరీక్షల్లో అభ్యర్థుల మాస్ కాపీయింగ్‌కు కీలకసూత్రధారిగా వ్యవహరించిన ఆర్‌డి పాటిల్‌కు సుప్రీంకోర్టు షాక్ ఇచ్చింది. అతడికి బెయిల్ ఇచ్చేందుకు నిరాకరిస్తూ పిటీషన్ కొట్టివేసింది. గురువారం న్యాయమూర్తి బిఆర్ గవాయ్ నేతృత్వంలో ద్విసభ్య ధర్మాసనం ఆదేశాలు ప్రకటించింది. 2023 అక్టోబరు 28న రాష్ట్రవ్యాప్తంగా ఎఫ్‌డిఎ పోస్టుల భర్తీకోసం రాత పరీక్షలు జరిపారు. కలబురగి నగరం శరణ బసవేశ్వర విశ్వవిద్యాలయం పరీక్షాకేంద్రంలో అభ్యర్థులకు బ్లూటూత్‌లు అందించి కాపీ చేసేందుకు ప్రయత్నించినప్పుడు పట్టుబడ్డాడు. అఫ్జల్‌పుర పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్‌ఐఆర్ నమోదైంది. విచారణ జరిపిన పోలీసులు పలువురిని అరెస్టు చేశారు. కాపీయింగ్ సూత్రధారి ఆర్‌డి పాటిల్‌గా తేలింది. ఆ తర్వాత అతడిని అరెస్టు చేశారు. బెయిల్‌కోసం హైకోర్టులో దరఖాస్తు చేసుకోగా తొలగించారు. ఈ మేరకు హైకోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. సుప్రీంకోర్టులోనూ ఆర్‌డి పాటిల్‌కు చుక్కెదురైంది.

సీఐడీ విచారణకు బీజేపీ ఎమ్మెల్సీ సీటీ రవి

బెంగళూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): బెళగావి సువర్ణసౌధలో విధాన పరిషత్‌లో మంత్రి లక్ష్మీహెబ్బాళ్కర్ పట్ల అశ్లీల వ్యాఖ్యలు చేశారనే ఆరోపణల వివాదాన్ని విచారణ జరుపుతున్న సిఐడి ముందు బీజేపీ సభ్యుడు సీటీ రవి హాజరయ్యారు. తొలి నోటీసుకు స్పందించని సీటీ రవికి మరోసారి నోటీసు జారీ చేశారు. ఈమేరకు గురువారం బెంగళూరు సిఐడి కార్యాలయానికి హాజరయ్యారు. తొలి నోటీసు వచ్చినప్పుడు తాను ఇంట్లో అందుబాటులో లేనని అందుకు విచారణ కాలేదన్నారు. పరిషత్‌లో జరిగిన పలు వ్యాఖ్యలు, అంశాలకు సంబంధించి సిఐడి అధికారులు సుదీర్ఘంగా ప్రశ్నించారు. అందుకు తగిన సమాధానాలు సీటీ రవి చెప్పినట్టు తెలిసింది.

రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ మృతి



వెంకటరెడ్డి (ఫైల్)

బాగేపల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని గూళూరు హోబళి ప్రభుత్వ హైస్కూల్ రిటైర్డు ఫిజికల్ డైరెక్టర్ జి.వి.వెంకటరెడ్డి (81) బుధవారం రాత్రి 9గంటలకు కన్నుమూశారు. వ్యాయామ ఉపాధ్యాయుడిగా 34ఏళ్లపాటు ఒకే పాఠశాలలో కొనసాగి రిటైరయ్యారు. జివిఆర్‌గా పేరొందిన ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అందరితో స్నేహంగా ఉండేవారు. వృత్తిలో ఎంతో మంది విద్యార్థులను క్రీడల్లో రాణించేలా ప్రోత్సహించి రాష్ట్ర, జాతీయస్థాయిలో సత్తా చాటేలా తీర్చిదిద్దారు. ఆయన అంత్యక్రియలు సరిహద్దున సత్యసాయి జిల్లా గౌనిపల్లి గ్రామంలో గురువారం జరిగాయి. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థుల సంఘం అధ్యక్షుడు ఎన్ నాగరాజ్, రా.న.గోపాల రెడ్డి, బాబాజాన్, నాగరాజు, ఉపా ధ్యాయులు జి రామసుబ్బమ్మ, జిఎన్ శివారెడ్డి, ఇవి రెడ్డెప్ప, పివి వెంకట రవణ, కృష్ణప్ప, మునియప్ప, గాజలు శీనప్ప తదితరులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. నారేపల్లి టోల్‌ప్లాజా వద్ద అంతిమ దర్శనానికి అవకాశం కల్పించడంతో పెద్దసంఖ్యలో పూర్వవిద్యార్థులు పాల్గొని నివాళులు అర్పించారు.

చేళూరు రోడ్డులో ఆక్రమణల తొలగింపు



యంత్రంతో ఆక్రమణల కూల్చివేత

చింతామణి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధాన రహదారులు, ఫుట్‌పాత్‌ల ఆక్రమణల తొలగింపు కార్యాచరణ కొనసాగుతోంది. నగరసభ కమిషనర్ చలపతి, నగరసభ అధ్యక్షుడు ఆర్ జగన్నాథ్, ప్రజా పనులశాఖ జేఈ ప్రసాదరెడ్డి, ఆరోగ్య అధికారి ఆరతి, విజయకుమార్, సికె బాబు తదితర అధికారుల నేతృత్వంలో గురువారం కార్యాచరణ సాగింది. ఉదయం చేళూరు రోడ్డులోని అంబేడ్కర్ సర్కిల్ నుంచి పనులు ప్రారంభించారు. ట్రాఫిక్ సజావుగా సాగేందుకు ప్రజలు, దుకాణ యజమానులు సహకరించాలని నగరసభ ఇప్పటికే పలుమార్లు విజ్ఞప్తి చేసింది. పోలీసు బందోబస్తు నడుమ పొక్లైనర్‌లతో ఆక్రమణలు తొలగిం చారు. పొరుగున తాలూకా కేంద్రమైన చేళూరు సహా బట్లహళ్ళి మీదుగా ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లే మార్గం కావడం, పట్టుగూళ్ల మార్కెట్, టమోటా మార్కెట్, కూరగాయల మార్కెట్, ఏపీఎంసీ మార్కెట్, పశువుల సంత జరిగే ప్రదేశం, పలు ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లు, ప్రముఖయాత్రాస్థలం మురగమల్లాకు వెళ్లేది ఈ మార్గంలోనే. ఇలా నిత్యం రద్దీగా ఉండే మార్గంలో ఆక్రమణలు తొలగించారు. విడతలవారీగా ఆక్రమణల తొలగింపు పనులు చేపట్టామని నగరసభ కమిషనర్ చలపతి తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న బస్సు.. ముగ్గురి మృతి


బెంగళూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రామనగర జిల్లాలోని కనకపుర - రామనగర జాతీయరహదారిపై అచలు గ్రామ సమీపాన గురువారం ఉదయం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృత్యువాత చెందారు. ద్విచక్ర వాహనంపై భార్యా, భర్త, ఇద్దరు పిల్లలు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కేఎస్ఆర్టీసీ బస్సు ఢీకొంది. ప్రమాదంలో తండ్రి, ఇద్దరు పిల్లలు మృత్యువాత చెందారు. కాగా ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహిళను రామనగర జిల్లా ఆసుపత్రికి తరలించారు. రామనగర రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. కాగా మృతుల పేర్లు తెలియరాలేదు. వీరు ఉత్తర కర్ణాటకకు చెందిన కూలీలుగా తెలుస్తోంది. రామనగర తాలూకా దాసేగౌడనదొడ్డి గ్రామంలోని ఇటుక బట్టీలో పనిచేసేవారని తెలుస్తోంది.

మరో ప్రమాదంలో నలుగురు..

పెరంబూర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మేల్‌మరువత్తూర్ నుంచి వస్తున్న కర్ణాటకకు చెందిన భక్తుల బస్సు, లారీ రాణీపేట వద్ద ఢీకొన్న ఘటనలో నలుగురు మృతిచెందగా, మరో 35 మందికి గాయాలయ్యాయి. వివరాలిలా వున్నాయి... కర్ణాటక రాష్ట్రం కోలార్ జిల్లా ముస్‌బాగల్ ప్రాంతానికి చెందిన భక్తులు మేల్‌మరువత్తూర్ ఆదిపరాశక్తి ఆలయ మాలధారణ చేసి, నాలుగు బస్సుల్లో ఆలయానికి వచ్చి స్వామి దర్శనం చేసుకొని బుధవారం రాత్రి తిరుగుప్రయాణమయ్యారు. అర్ధ రాత్రి 12 గంటల ప్రాంతంలో చెన్నై-చిత్తూరు జాతీయ రహదారిలోని రాణిపేట జిల్లా సిప్కాట్ ప్రాంతంలో భక్తులతో వస్తున్న బస్సు, మట్టి లోడుతో వస్తున్న లారీని ఓవర్‌టేక్ చేసేందుకు ప్రయత్నించగా, ఆంధ్ర నుంచి కూరగాయల లోడుతో ఎదురుగా వచ్చిన వ్యాన్ బస్సును ఢీకొంది. అదే సమయంలో మట్టి లారీ కూడా బస్సును వెనుక నుంచి ఢీకొంది. దీంతో మూడు వాహనాలు రోడ్డు పక్కన పల్లపు ప్రాంతంలోకి వెళ్లాయి.. ఈ ఘటనలో వ్యాన్ డ్రైవర్ మంజునాథ్ (30), క్లీనర్ శంకర్ (32), కృష్ణప్ప (65), సోమశేఖర్ (30) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందారు. బస్సులో ప్రయాణిస్తూ గాయపడిన 35 మందిని వాలాజా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని రాణిపేట జిల్లా ఎస్పీ వివేకానంద శుక్లా పరిశీలించారు. ఈ ఘటనపై సిప్కాట్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటన కారణంగా ఆ మార్గంలో సుమారు 2 గంటలపాటు వాహనాల రాకపోకలు స్తంభించాయి.



ప్రమాద స్థలంలో బస్సు, లారీ



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1625.17	1,589.03
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	8,146	0
నీటి నిల్వ (టీఎంసీలు)	77.04	10.24

అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఏకగ్రీవం

బళ్లారి సిటీ, జనవరి 9(ఆంధ్రజ్యోతి): బళ్లారి సహకారం సంఘం నూతన అధ్యక్షుడిగా రుణగ్రహీతల నియోజకవర్గం నుంచి ఎత్తినబూదిహాల్ బి.శ్రీనివాస రెడ్డి, పోస్టు వెంకటేశ్ కుమార్తె శిల్పా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నగరంలోని ప్రాథమిక రైతుల సహకార సంఘం(సొసైటీ), ఐదేళ్ల పాటు పాలకమండలి అధ్యక్షఉపాధ్యక్ష పదవులకు సొసైటీ కార్యాలయంలో ఎన్నికలు జరిగాయి. శ్రీనివాసరెడ్డి, శిల్పా మాత్రమే నామినేషన్ దాఖలు చేయడంతో పోటీ లేకుండా జరిగింది. శ్రీనివాసరెడ్డి అధ్యక్ష పదవిని కైవశం చేసుకున్నారు. 34ఓట్లతో గెలిచిన శిల్పా ఉపాధ్యక్షురాలయ్యారు. ఇద్దరూ కూడా తొలిసారి ఎన్నికయ్యారు. అ తరువాత జరిగిన సమావేశంలో 12మంది డైరెక్టర్లకుగాను 8మంది మాత్రమే హాజరయ్యారు. సీనియర్ సభ్యులు మించేరికి చెందిన ఎస్.దొడ్డనగౌడ, జె.పంపాపతి,శారదమ్మ, శ్రీకళ, అంజనేయ, కల్పన, సీనియర్ సభ్యులు కెరకోడప్ప,హంపవతి,పక్కీరప్ప, చంద్ర సమావేశానికి గైర్హాజరయ్యారు. సమావేశంలో సొసైటీ అధికారి అమీనాబేగం, సహకార్మికులు చిదానందరెడ్డి, మాజీ అధ్యక్షులు తిమ్మప్ప, ముండ్లూరు శ్రీధర్, పోస్ట్ వెంకటేశ్ తదితరులున్నారు.

నేడు రథోత్సవం



నూతన రథం

బళ్లారి సిటీ, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ప్రతి సంవత్సరం మాదిరిగానే శుక్రవారం సాయంత్రం అల్లీపుర మహాదేవతాత రథోత్సవం జరగనుంది. ఇక నుంచి భక్తుల కోరిక మేరకు ప్రతి అమావాస్య ఉదయం మఠంలో రథోత్సవం నిర్వహించనున్నారు. శుక్రవాం ఉదయం పూల తేరు రథోత్సవం జరగనుంది. భక్తులు విరివిగా పాల్గొన్ని రథోత్సవాన్ని విజయ వంతం చేయాలని ట్రస్టు సభ్యులు తెలిపారు. తెల్లవారుజామున మఠంలో పుష్పాలంకరణ, గంగపూజ, కుంభ తాండవం, ఉదయం శివయోగి మడివాళేశ్వర పురాణం మహామంగళహారతి చేపట్టనున్నారు. భక్తులకు సకల ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు.

గడ్డివాములు దగ్ధం



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక అధికారులు

కంప్లి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): విజయనగర జిల్లా హడగళి తాలుకా దాదాపుర గ్రామంలో గురువారం మధ్యాహ్నం ఆకస్మికంగా మంటలు ఏర్పడి నాగరాజు అనే రైతు గడ్డివాములు దగ్ధమయ్యాయి. గమనించిన స్థానిక రైతులు అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న సిబ్బంది మంటలను అదుపు చేశారు. సుమారు రూ. 3 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు రైతు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు పరిశీలించి న్యాయం చేయాలని కోరారు.

విజయనగర జిల్లాలో బంద్ పాక్షికం



బస్సులులేక బోసిపోయిన హొసపేట బస్టాండ్

బళ్లారి గాంధీనగర్, జనవరి9(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ గురించి అవహేళనగా మాట్లాడిన కేంద్ర హోంశాఖామంత్రి అమిత్ షా వ్యాఖ్యలను ఖండిస్తూ రాజ్యాంగ రక్షణ సమితి పిలుపు మేరకు గురువారం నిర్వహించిన బంద్‌కు విజయనగర జిల్లా బంద్‌కు మిశ్రమ స్పందన లభించింది. జిల్లా కేంద్రమైన హొసపేట నగరంలో బంద్ విజయవంతమైనా, కూడ్లిగి, హగరి బొమ్మనహళ్ళిలో అంతంత మాత్రమే కనిపించింది. అయితే పరపనహళ్ళి, హూవినహడగలి, కొట్టూరు, తాలూకాల్లో మాత్రం బంద్ ప్రభావం పెద్దగా కనిపించలేదు. హొసపేట నగరంలో మాత్రం దుకాణాలు మూతబడ్డాయి. వాణిజ్య దుకాణలు స్వచ్ఛందంగా మూసివేశారు. బస్సుల రాకపోకలు లేకపోవడంతో హొసపేట నగరంలో రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. బస్టాండ్ బోసిపోయి కనిపించింది. నిత్యావసర వస్తువుల కూరగాయల మార్కెట్ కొంతమేర అంగళ్ళు తెరవగా, కూరగాయలు కొనడానికి చాలా తక్కువ మోతాదులో మార్కెట్ రావడం కనిపించింది. ప్రభుత్వం పాఠశాలు యధావిధిగా పనిచేశాయి. బస్సులు, రిక్షాలు లేనికారణంగా పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల సంఖ్య తక్కువగా కనిపించింది. ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు యథావిధిగా పనిచేశాయి. హొసపేట తాలూకా పరిధిలోని రెండు ఫిర్కా ప్రాంతాలైన మరియమ్మనహళ్ళి తహసీల్దారు ద్వారా రాష్ట్రపతికి ఆందోళనకారులు మనవిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీనియర్ రచయిత తరికెరె, వివిధ సంఘాల ప్రముఖులు జంబయ్య నాయక, బణ్ణదమనె సోమశేఖర్, హెచ్.ఎన్.ఎఫ్ మొహ్మద్ ఇమామ్ నియాజీ, రామచంద్రబాబు, కె.ఎం. సంతోష్ కుమార్, కె.నాగరత్నమ్మ, ఎన్.యల్లాలింగ, వెంకటేష్, సణ్ణమారెప్ప, తదితరులు మాట్లాడుతూ కేంద్ర మంత్రి మండలి నుండి అమిషాను తప్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రపతి, లోకసభ స్పీకర్‌కు వినతిపత్రాలు తహసీల్దార్ ద్వారా వినతిపత్రాలు పంపారు.

ఘనంగా శారద విద్యాపీఠ వార్షికోత్సవం



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న విశ్వప్రసన్న తీర్థ స్వామీజీ

బళ్లారి సిటీ, జనవరి 9(ఆంధ్రజ్యోతి): నగరంలోని సత్యనారాయణ పట్టణంలోని శారద విద్యాపీఠ పాఠశాల వార్షికోత్సవాన్ని విశ్వప్రసన్న తీర్థస్వామీజీ, రమాదేవి గురువారం జ్యోతి వెలిగించి ప్రారంభించారు. నగర మేయర్ ముల్లంగి నందీశ్, కార్పొరేటర్ అశోక్ పాఠశాల స్మారక సంచికను విడుదల చేశారు. కార్యమంలో మేయర్ మాట్లాడుతూ.. శారద విద్యాపీఠ స్కూల్ పంజాబ్, చండీగడ్ విశ్వవిద్యాలయం క్యాంప్స్ కర్ణాటకచే ఉత్తమ పాఠశాలగా గుర్తించబడింది. సంస్థ సేవలు ఎన్నటికీ మరువలేనివన్నారు. తదుపరి చిన్నారులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఆర్టీఐ కమిషనర్‌గా డాక్టర్ కేఆర్ దుర్గేష్



రాయచూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): రిమ్స్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న డాక్టర్ కేఆర్ దుర్గేష్‌కు ప్రభుత్వం రాయచూరు నగరాభివృద్ధి కమిషనర్‌గా అదనపు బాధ్యతలను అప్పగించింది. ఈ మేరకు ఆయన గురువారం బాధ్యతలు స్వీకరించారు. కాగా వ్యక్తిగత కార్యదర్శి పేరున పంపె ఫిర్యాదులను ఇక నుంచి నగరంలోని ఐడీఎస్ఎంటీ లేఔట్‌లోని ఆర్టీఏ కార్యాలయంలో అందజేయాలని ఆయన ప్రకటించారు. ఏ శాఖలో సమచారం కావాలన్నా ప్రజలు పొందవచ్చని, నిర్లక్ష్యం వహిస్తే ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

బాలింతలకు వైద్యంలో ప్రభుత్వ నిర్లక్ష్యం: ఎమ్మెల్యే

రాయచూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో వరుసగా ప్రభుత్వ ఆస్పత్రిల్లో కాన్పు జరిగిన బాలింతలు మరణిస్తున్నా ప్రభుత్వం నుంచి స్పందన లేదని దేవదుర్గ ఎమ్మెల్యే కరెమ్మ నాయక్ ఆరోపించారు. ఈ విషయంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. దేవదుర్గ తాలూకాకు చెందిన మహిళ ఒకరు ఇటీవల రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృత్యువాతపడిన నేపథ్యంలో బాలింత కుటుంబాన్ని గురువారం ఎమ్మెల్యే పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాలతో పాటు రాయచూరులోని ఇప్పటికే ఐదుగురికిపైగా మహిళలు బాలింత చావులకు గురైయ్యారని ఈ విషయంలో ప్రభుత్వం ఎలాంటి నివారణ చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వం తన ఉచిత పథకాల సంగతి పక్కన పెట్టి తొలుత సర్కారు దావాఖానాల్లో సౌకర్యాలు మెరుగు పరచాలన్నారు. రిమ్స్ వంటి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో సహితం సరైన వైద్య సదుపాయాలు లేవని సరైన వైద్యులు అందుబాటులో ఉండాలని దీని పై తక్షణం దృష్టి సారించాలన్నారు. కాగా జేడీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎం.విరుపాక్షి మాట్లాడుతు రిమ్స్ ఆస్పత్రిలోని వైద్యులు తాము నిర్వహించే ప్రైవేటు చికిత్సల పట్ల మొగ్గు చూపుతూ రిమ్స్ ఆస్పత్రిని నిర్లక్ష్యం చేస్తున్నారని ఈ విషయంలో ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యదక్షుడు ఎన్.శివశంకర్ మాట్లాడుతు ప్రభుత్వ ఆస్పత్రుల్లో బాలింతలకు ఇచ్చే ఔషధాలు నాసిరకంగా ఉండడం వల్లే మరణాలు సంభవిస్తున్నాయని పరోక్షంగా ఈ ఆరోపణను ప్రభుత్వమే ఒప్పుకుంటున్నా నివారణ చర్యలను మాత్రం చేపట్టడం లేదన్నారు. ప్రభుత్వ ధోరణి ఇదే విధంగా కొనసాగితే తమ పార్టీ రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు సిద్ధపడుతుందన్నారు.



వైద్యసేవలపై ఆరాతీస్తున్న ఎమ్మెల్యే కరెమ్మ నాయక్

మారెమ్మదేవిని దర్శించుకున్న ఎంపీ

తోరణగల్లు, జనవరి 9(ఆంధ్ర జ్యోతి): సండూరు తాలుకా శ్రీరామశెట్టిహళ్లి గ్రామంలో గాలి మారెమ్మదేవి జాతర సందర్భంగా గురువారం ఎంపీ తుకారామ్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మ దయతో అందరూ సంతోషంగా ఉండాలని, పంటలు బాగా పండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పూజారి నాగప్ప గ్రామం పంచాయతీ సభ్యులు కార్యకర్తలు భక్తాదులు పాల్గొన్నారు.



అమ్మవారి ఆలయంలో ఎంపీ తుకారామ్



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సామాజిక వేత్త వేములపల్లి గాంధీ

నాటకాలతో విద్యార్థులకు సామాజిక స్పృహ

● నంద రెసిడెన్షియల్ స్కూల్ చైర్మన్ గాంధీ

బళ్లారి సిటీ, జనవరి 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు సామాజిక స్పృహ పెంచేందుకు నాటకాలు దోహదపడుతాయని సామాజిక వేత్త వేములపల్లి గాంధీ అన్నారు. నగరంలో గురువారం రాఘవ కళామందిరంలో రఘురామ కళా మిత్ర బోర్డు ఆధ్వర్యంలో ఆంగ్ల నూతన సంవత్సరం, సంక్రాంతి 2025 భాగంగా నాటకాన్ని ప్రదర్శించారు. కార్యక్రమాన్ని నంద రెసిడెన్షియల్ స్కూల్ చైర్మన్ వేములపల్లి గాంధీ ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుతం సమాజానికి సందేశం ఇచ్చే నాటకాలు రావాల్సిన అవసరం ఉందన్నారు.

సందేశాత్మక నాటకాలను ప్రోత్సహించడంలో రాఘవ కళా మందిరం ఎప్పుడూ ముందుంటుందని రాఘవ మెమోరియల్ అసోసియేషన్ అధ్యక్షుడు కోటేశ్వరరావు అన్నారు. ఈసందర్భంగా రాఘవ మెమోరియల్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు కె.చన్నప్ప సందేశం ఇచ్చారు. ఈసందర్భంగా జిల్లా కళాకారుల సంఘం అధ్యక్షుడు యల్లనగౌడ శంకరబండె, భీమనేని ప్రసాద్, చౌదరి, వెంకటేశులు, రామాంజనేయులు, మదన్‌మోహన్, గంగన్న, శివేశ్వరగౌడ్, కళాభిమానులు తదితరులు పాల్గొన్నారు. నేతి రఘురాం రచించిన 'అమ్మానన్ను క్షమించు'నాటకం, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.

అనాథలకు అండగా ధర్మస్థళ గ్రామీణాభివృద్ధి సంస్థ



దివ్యాంగుడికి వీల్‌చైర్ అందజేస్తున్న సంస్థ సభ్యులు

బళ్లారి గాంధీనగర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): శ్రీక్షేత్ర ధర్మస్థళ గ్రామీణాభివృద్ధి అనాథలకు, దివ్యాంగులకు అండగా నిలుస్తోందని సంస్థ జిల్లా డైరెక్టర్ రోహితాక్ష పేర్కొన్నారు. సామాజిక సేవాకార్యక్రమంలో భాగంగా గురువారం బళ్ళారి విభాగం పరిధిలోని శ్రీరాంపుర్‌లో దివ్యాంగుడు జక్రియా ఖాన్‌ను సంస్థ తరపున వీల్ చైర్ అందజేశారు. సీనియర్ సిటిజన్‌లు, వయోవృద్ధులు సమాజానికి భారం కారాదని, కుటుంబ సభ్యులకోసం, పిల్లల సర్వతోముఖాభివృద్ధికి ఎంతో శ్రమించిన వారిని వృద్ధాప్యంలో నిర్లక్ష్యం చేయడం తగదని ఆయన హితువు పలికారు. వృద్ధుల పోషణ భారంగా భావిస్తూ వృద్ధాశ్రామాలకు పంపండం సరికాదన్నారు. వారికి గౌరవం అందించి వారు జీవించనంత కాలం పెద్దలను సంరక్షించుకోవాలన్నారు. ధర్మస్థళ గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రస్తుత ఏడాది రూ 2.66కోట్ల రూపాయలు విలువ చేసే 8,188 మంది వైకల్యంతో బాధపడుతున్న వారికి అవసరమైన పరికరాలు అందజేస్తున్నామన్నారు. క్షేత్ర యోజనాధికారులు వెంకటేష్ పటగార్, శ్రీరాంపూర్ విభాగం పరిశీలకులు శ్వేత, యూనియన్ అధ్యక్షుడు సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ముద్దటనూరు సహకార సంఘం ఎన్నిక ఏకగ్రీవం



అధ్యక్ష, ఉపాధ్యక్షులను అభినందిస్తున్న సభ్యులు

కంప్లి, జనవరి 9(ఆంధ్ర జ్యోతి): శిరిగేరి సమీపంలోని ముద్దటనూరు కృషిపత్తిన సహకార సంఘం అధ్యక్ష,ఉపాధ్యక్ష ఎన్నికలు ఏకగ్రీవంగా ముగిశాయి. ఈ కృషిపత్తిన సహకార సంఘంలో 12 మంది సభ్యులు వుండగా అధ్యక్ష స్థానానికి సూరిబాబు, ఉపాధ్యక్ష స్థానానికి సత్యనారాయణలు నామినేషన్ వేశారు. ఆ స్థానానికి ఎవరూ పోటీ లేనందువలన వారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి లక్ష్మీకాంతరెడ్డి తెలిపారు. గెలుపొందిన అధ్యక్ష, ఉపాధ్యక్షులను, సభ్యులను పలువురు నాయకులు ముద్దటనూరు, హావినాళ్, గుండిగ నూరు, చెన్నపట్నం, మాలాపురం, శిరిగేరి రైతులు తదితరులు వారిని అభినందించి పూలమాలలతో సన్మానించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు కామినేడి సూరిబాబు మాట్లాడుతూ గత 15 సంవత్సరాల పాటు సొసైటీకు అభివృద్ధితో పాటు మరో రైతులకు అనుగుణంగా మందులు, ఎరువులు, విత్తనాలు అందుబాటులో వుంచడంతో పాటు గత యేడాది రూ. 76 లక్షలతో నూతన గోదాము, సమావేశం హాలు, కార్యాలయం గదులు ఏర్పాటు చేశాము. జిల్లాలోనే మాదిరి సహకార సంఘంగా పేరుగాంచిందన్నారు. నాల్గవసారి కూడా తమపై నమ్మకం వుంచి తమను ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి పరశురామ్, మాజీ ఎమ్మెల్యే చంద్రయ్య స్వామి, మాజీ బుడా అధ్యక్షులు పాలన్న, కే శ్రీనివాసరావు, రాజాగౌడ, మల్లన్నగౌడ, కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

హోసూరు జోన్

కోర్టు ఆవరణలో తనిఖీలు



కారును సోదా చేస్తున్న పోలీసులు

హోసూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): హోసూరు కోర్టు ఆవరణలో పోలీసు బందోబస్తు పెంచారు. వివరాలిలా. హోసూరు సమీపంలోని కోళదాసపురం ప్రాంతంలో మద్యం దుకాణం వద్ద ఓ యువకుడు సెప్టెంబరు 18న రాత్రి దారుణ హత్యకు గురయ్యాడు. బాగలూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయ్యగా కర్ణాటక రాష్ట్రం సుళకుంట కాలనీకి చెందిన రేవంత్‌కుమార్ (26)గా గుర్తించారు. హత్య కేసులో ప్రధాన నిందితుడు కర్ణాటక రాష్ట్రానికి చెందిన రేవణ్ణను అరెస్ట్ చేసి విచారణ చేయ్యగా వినాయక చతుర్థి రోజున వినాయకుడి విగ్రహ ప్రతిష్టాపన విషయంల్లో తలెత్తిన వివాదంలో రేవంత్‌కుమార్‌ను హత్య చేసినట్లు తెలుస్తోంది. నిందితుడిని అరెస్టు చేసి జైలుకు తరలించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు రేవణ్ణ బెయిల్‌పై బయటకు విడుదలయ్యాడు. కాగా రేవణ్ణ గురువారం హోసూరు కోర్టులో సంతకం చేసేందుకు కారులో వచ్చాడు. అప్పుడు అతనికి రక్షణగా మరో కారు వచ్చింది. బాగలూరు ఇన్‌స్పెక్టర్ ప్రకాశ్, అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ ప్రభాకర్ కోర్టు వద్ద బందోస్తులో ఉన్నారు. కారులో 5 మంది ఉండగా వారిని తనిఖీ చేయగా చేతి తుపాకి ఉన్నట్టు గుర్తించారు. కారును, తుపాకీలను స్వాధీనం చేసుకుని నగర పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్కడ ఎస్పీ తంగదురై ఏఎస్పీ విచారణలో జాతీయస్థాయిలో లైసెన్సు పొందామని తెలిపారు. లైసెన్స్ పొందినా కోర్టు ఆవరణలోకి ప్రైవేట్ వ్యక్తులు తుపాకీలు తీసుకురావడం నేరమని హెచ్చరించారు.

ఘనంగా యోగానంద జయంతి

బళ్లారి సిటీ, జనవరి 9(ఆంధ్రజ్యోతి): పరమహంస యోగానంద 131వ జయంతిని నగరంలోని డ్రీమ్ వరల్డ్ పాఠశాలలో గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డ్రీమ్ వరల్డ్ పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు భగవద్గీత, వెంకటేశ్వర సుప్రభాతం, హనుమాన్ చాలీసా, విష్ణు సహస్రనామం, భజన పాటలు పాడి కార్యక్రమానికి హాజరైన అతిథులను, విద్యార్థుల తల్లిదండ్రులను ఆకట్టుకున్నాయి. ఈసందర్భంగా డ్రీమ్ వరల్డ్ చీఫ్ అనిల్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు సంస్కృతి, సాంప్రదాయాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈసందర్భంగా తల్లివంద్రులు, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



సంక్రాంతి కానుకలు అందజేస్తున్న డీఎంకే నాయకులు

సంక్రాంతి కిట్‌ల పంపిణీ

హోసూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): హోసూరు పరిధిలోని 22వ వార్డు మునీశ్వరన్ నగర్‌లో రేషన్ దుకాణాల్లో గురువారం సంక్రాంతి కానుకలు అందజేశారు. హోసూరు కార్పొరేషన్ పబ్లిక్ హెల్త్ కమిటీ చైర్మెన్ మరియు స్థానిక వార్డు డీఎంకే కౌన్సిలర్ మాదేశ్వరన్ అధ్యక్షతన వహించారు. సంక్రాంతి కిట్‌లో బియ్యం, చెరుకు, దుస్తులు, పండుగకు అవసరమైన రేషన్ ఉన్నాయి. ఈ సందర్భంగా మునీశ్వర నగర్ నివాసుల సంఘం అధ్యక్షుడు ప్రకాశ్, డీఎంకే వార్డు కార్యదర్శి ఆరుముగం, సంఘం కార్యదర్శి రవి, జిల్లా ద్రావిడ కళగం అధ్యక్షుడు వనవేందన్, డీఎంకే కార్యవర్గ సభ్యులు వరుణ్, అప్సర, యశోదరాణి, ముత్తు కుమార్, జయప్రకాశ్, కాళీముత్తు, దేవరాజు, రవి, కిషోర్ తదితరులుపాల్గొన్నారు.

సీమాన్‌పై చర్యలకు డిమాండ్

హోసూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ద్రవిడ ఉద్యమనేత, డీకే సంస్థాపకుడు పెరియార్ రామస్వామి పట్ల నామ్ తమిళర్ పార్టీ (ఎన్‌టికె) చీఫ్ కోర్డినేటర్ సీమాన్ అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ద్రావిడ కళగం డిమాండ్ చేసింది. వడలూరులో ఈనెల 8న పెరియార్‌ను కించపరిచేలా మాట్లాడిన సీమాన్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ ద్రావిడ కళగం జిల్లా అధ్యక్షుడు వనవేందన్ ఆధ్వర్యంలో ఏడీఎస్పీ అక్షయ్ అనిల్‌వాక్రేకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పార్టీ జనరల్ కమిటీ సభ్యుడు ఎ.సెల్వం, జిల్లా కార్యదర్శి చిన్నస్వామి, నగర అధ్యక్షుడు రమేశ్, నగర కార్యదర్శి చిన్నరాసు, జిల్లా అధ్యక్షురాలు సెల్వి, కార్తీక్ పాల్గొన్నారు.



ఏడీఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న ద్రావిడ కళగం నాయకులు

రెవెన్యూ గ్రామ ప్రకటనపై అధికారుల సమీక్ష

గంగావతి రూరల్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): తాలూకా పరిధిలోని సూర్యనాయకన తండా వార్డు నంబరు 6 లంబాడి తండాను రెవెన్యూ గ్రామంగా ప్రకటించాలని గ్రామానికి చెందిన బాలాజి టి. చహ్వాన్ ప్రభుత్వాన్ని కోరిన నేపథ్యంలో గురువారం రెవెన్యూ అధికారులు సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర రెవెన్యూ కమిషనర్ కార్యాలయం ప్రధాన కార్యదర్శి, జాయింట్ కార్యదర్శి, రెవెన్యూ గ్రామ విభాగ అధికారి శ్వేత, స్థానిక తహసీల్దారు, తాలూకా పంచాయతీ కార్యనిర్వహణ అధికారి, జిల్లా పంచాయతీ అసిస్టెంట్ కార్యనిర్వహణ అధికారి, ఇంజనీర్లు, సర్వ అధికారులు సంయుక్తంగా సమీక్షలు జరిపారు. ఈ సందర్భంగా అధికారులకు అవసరమైన అవసరమైన సమాచారాన్ని గ్రామ పెద్దలు అందజేశారు.



గ్రామస్థులతో మాట్లాడుతున్న అధికారులు

లారీ యజమానుల సంఘంలో వర్గపోరు

● ఆధిపత్యం కోసం దాడులు.. ఇద్దరు ఆసుపత్రి పాలు...

బళ్లారి గాంధీనగర్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): బళ్లారి లారీ యజమానుల సంఘంలో వర్గపోరు రగులుకుంటోంది. ఆధిపత్యం కారణంగా ఒకరిపై ఒకరు దాడులకు సైతం పాల్పడుతున్నారు. బుధవారం లారీ టర్మినల్‌లో మాజీ లారీ సంఘం అధ్యక్షుడు పెద్దన్న, సంఘం సభ్యులు నారాయణ స్వామిపై గుర్తు తెలియని వ్యక్తులు రాళ్ళతో దాడి చేయడంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడి బిమ్స్‌లో చేరారు. కొద్దిపాటి గాయాలతో బయట పడిన పెద్దన్న రాత్రి బ్రూస్‌పేట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఏడాదిగా బళ్లారి లారీ యజమానుల సంఘంలో వర్గపోరు నడుస్తోంది. ఇందులో ఒక వర్గానికి స్థానిక నాయకుల అండదండల కారణంగా తనను బళ్లారి యజమానుల సంఘం అధ్యక్ష స్థానం నుంచి క్రిందికి దించినట్లు మాజీ అధ్యక్షుడు పెద్దన్న పేర్కొన్నారు. తాము ఇద్దరం దళిత వర్గానికి చెందిన వారు కావడంతో అధ్యక్ష స్థానంలో తాము అధ్యక్ష స్థానానికి అర్హులు కాదని బలవంతంగా తమచేత అధ్యక్ష స్థానానికి రాజీనామా చేయించినట్లు పోలీసుల ఫిర్యాదులో పేర్కొన్నాడు. బుధవారం ఉదయం 11.30గంటల సమయంలో లారీ టర్మినల్ ఓం సాయి ట్రాన్స్‌పోర్టు ఆఫీసులో మిత్రులతో కలిసి మాట్లాడుతుండగా, బళ్లారి నగరానికి చెందిన మెబబూబ్ భాష కుమారుడు ముల్లా సమీర్, ముల్లా సాజీద్, స్నేహితులు సుహేల్, మహబూబ్ బాషా, శ్రీనివాస్ తమపై దాడికి పాల్పడినట్లు పోలీసుల ఫిర్యాదులో పేర్కొన్నాడు. తాము దళితులమంటూ జాతి నిందతో దుర్భాషలాడుతూ రాళ్ళతో ఒకరి తరువాత ఒకరు ఇద్దరిపై దాడికి పాల్పడినట్లు ఫిర్యాదులో వివరించారు. లారీ సంఘం పదాధికారుల కారణంగా తమకు ప్రాణ హాని ఉందని, రక్షణ కల్పించాలని పెద్దన్న పోలీసులను కోరాడు. బ్రూస్‌పేట పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



చికిత్స పొందుతున్న నారాయణస్వామి